మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి

మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
సోమవారం | 13 | ఏప్రిల్ | 2026 పేజీలు : 12


2వ పేజీలో

# ప్రజా ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

**వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు : వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్**

**విశాఖపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను చేరువ చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, రాష్ట్రంలో వైద్య రంగం గత రెండేళ్లలో అద్భుతమైన వృద్ధిని సాధించిందని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం విశాఖపట్నంలోని చెస్ట్ అండ్ కమ్యూనికబుల్

# గ్యాస్ ఏజెన్సీల మాయాజాలం..!

- వినియోగదారుల ఆగ్రహావేశం
- సకాలంలో అందని సిలిండర్లు
- బ్లాక్ మార్కెట్ దందా
- నిఘా శూన్యం


2వ పేజీలో

**ఆనందపురం , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** గ్యాస్ సరఫరా వ్యవస్థలో తీవ్ర అవ్యవస్థలు నెలకొన్నాయి. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, సిబ్బంది చేతివాటం కారణంగా సాధారణ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా, ఆన్‌లైన్ ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసిన సిలిండర్లు సకాలంలో అందకపోవడం ప్రజల్లో


9వ పేజీలో

# నేడు డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ'

**విశాఖపట్నం , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ సంబంధిత సమస్యలను వేగవంతంగా


2వ పేజీలో

# ట్రాఫిక్ నిబంధనలు వారిపై ఒక్కరోజు 2,745 కేసులు నమోదు

**విశాఖపట్నం , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** ట్రాఫిక్ నిబంధన పాటించని


2వ పేజీలో

# రాష్ట్ర సమాచార కమిషనర్ ను కలిసిన రాష్ట్ర ప్రాసిక్యూషన్ డైరెక్టర్ బైరా

**విశాఖపట్నం , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బైరా రామకోటేశ్వరరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమావేశానికి సంబంధించిన

# ట్రాఫిక్ నిబంధనలు వారిపై ఒక్కరోజు 2,745 కేసులు నమోదు

**ఒకటి తరువాయి** వారిపై టాపిక్ పోలీసులు కొరడా జులిపించారు. ఒక్కరోజే 2,745. కేసులు నమోదు చేశారు. విశాఖపట్నం సిటీలో రోజురోజుకు వాహనాల సంఖ్య పెరగడం కారణంగా వాహనదారులు వివిధ రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలకు తరచుగా పాల్పడుతున్నారు. దీనివలన రోడ్డు ప్రమాదాలు సంభవించడం, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లడం జరుగుతోంది. నగరంలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరచాలనే సంకల్పంతో, ట్రాఫిక్ పోలీసు వారు వివిధ కూడళ్ళలో ట్రాఫిక్ ను నియంత్రించడం, క్రమ బద్ధీకరించడం జరుగుతోంది. ఇందులో భాగంగా తే 11-04-2026 న విశాఖపట్నం సిటీ ట్రాఫిక్ విభాగం మోటరు వాహనాల చట్టం ప్రకారం చలానాలు విధించారు. హెల్మెట్ ధరించని వారిపై పెట్టిన కేసులు-1286,పిలియన్ రైడర్ హెల్మెట్ ధరించని వారిపై పెట్టిన కేసులు-250,త్రిబుల్ రైడింగ్ చేసిన వారిపై పెట్టిన కేసులు-92,ఓవర్ స్పీడ్ పై పెట్టిన ( వెహికల్ ద్వారా) కేసులు-373,సెల్ ఫోన్ డ్రైవింగ్ చేసిన వారిపై పెట్టిన కేసులు-31,డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిపై పెట్టిన కేసులు-07,రాంగ్ పార్కింగ్ లో పెట్టిన వాహనాలు టోయింగ్ చేసిన వాహనాలపై పెట్టిన కేసులు-84,రాంగ్ పార్కింగ్ చేసిన వారిపై పెట్టిన కేసులు-156,మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై పెట్టిన కేసులు-42,70 వాహనాలను సీజ్ చేశారు. ఇతర మోటార్ వాహనాల చట్టం ఉల్లంఘనలు చేసిన వారిపై పెట్టిన కేసులు-483, కేసులు చొప్పున నమోదు చేసి 2,745 చలానాల విధించారు. ఇవే కాకుండా నగరంలో బైక్ రేసింగ్, రాష్ డ్రైవింగ్, మోడిఫై చేసిన సైలెన్సర్లను ఉపయోగించడం లాంటి ఉల్లంఘనలు చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. కావున వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీస్ వారికి సహకరించవలసిందిగా విశాఖ ప్రజలకు విజ్ఞప్తి ట్రాఫిక్ రూల్స్ మన బాధ్యత పాటించడం మన బాధ్యత, ట్రాఫిక్ రూల్స్ మన సఖ్యత సాగించడం మన ఐక్యత, జీవితంలో స్పీడ్గా ఎదగాలని కోరుకో డ్రైవింగ్ లో స్పీడ్ లిమిట్స్ ని తెలుసుకో, మద్యం మత్తులో వాహనం నడపకు ఎటు పయనమో ఎమవుదవో చివరకు, చిన్ననిర్లక్ష్యం పెద్దప్రమాదం తెస్తుందిహెల్మెట్, సీట్బెల్టు ఉన్నది భద్రతకోసమేగాని అలంకారం కోసం కాదు దీని నిధరించండి భద్రతతో కూడిన ప్రయాణం చేయాలని విశాఖపట్నం సిటీ ట్రాఫిక్ అడిషనల్ డిప్యూటీ కమీషనర్ సూచించారు.

# మాయాజాలం..!



**ఒకటి తరువాయి** అసహనాన్ని పెంచుతోంది. వినియోగదారులు మొబైల్ అప్లికేషన్ లేదా వెబ్సైట్ ద్వారా బుకింగ్ చేసిన కొద్ది గంటలకే "డెలివరీ పూర్తి" అయినట్లు సందేశాలు అందుతున్నప్పటికీ, వాస్తవానికి సిలిండర్ మాత్రం వారి గృహాల వద్దకు చేరడం లేదు. ఈ పరిణామం గ్యాస్ ఏజెన్సీల నిర్వహణపై అనేక అనుమానాలకు తావిస్తోంది. "డెలివరీ ఇచ్చినట్లు చూపించి సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారా?" అనే ప్రశ్న వినియోగదారుల్లో ఉత్కంఠను రేకెత్తిస్తోంది. కొంతమంది బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, సిలిండర్ కోసం ఏజెన్సీని సంప్రదించినప్పుడు స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మరికొందరు వినియోగదారులు అత్యవసర పరిస్థితుల్లో అదనపు ధరలకు సిలిండర్ కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ పరిణామం సాధారణ ప్రజలపై ఆర్థిక భారం మోపుతోంది. ఇదిలా ఉండగా, గ్యాస్ సరఫరా వ్యవస్థను పర్యవేక్షించాల్సిన సంబంధిత నిఘా విభాగాలు పూర్తిగా విఫలమయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం మౌనంగా ఉండటం వల్ల ఏజెన్సీల అక్రమాలు మరింత పెరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పారదర్శకంగా సేవలు అందించాల్సిన గ్యాస్ ఏజెన్సీలు, వినియోగదారుల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్యాస్ సరఫరా వ్యవస్థలో పారదర్శకత, సమయ పాలనను పునరుద్ధరించడం అత్యవసరం అనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. వినియోగదారుల హక్కులను కాపాడటంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు.

# రాష్ట్ర సమాచార కమిషనర్ ను కలిసిన రాష్ట్ర ప్రాసిక్యూషన్ డైరెక్టర్ బైరా

**ఒకటి తరువాయి** ముఖ్యాంశాలను ఆయన వివరంగా తెలియజేశారు.. సమావేశంలో న్యాయవ్యవస్థలో ప్రజలకు సమర్థవంతమైన న్యాయసేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పనితీరులో నాణ్యత పెంపు, కేసుల వేగవంతమైన పరిష్కారం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. అలాగే న్యాయపరమైన వ్యవహారాల్లో పారదర్శకత, బాధ్యతాయుత విధానాల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఈ మర్యాదపూర్వక భేటీలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ హమీద్, జిల్లా ప్రధాన న్యాయస్థానం ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్ రామ్మూర్తి నాయుడు , జిల్లా కోర్టుల అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏ జి పి) కన్నూరు అప్పల నాయుడు పాల్గొన్నారు.

# ప్రజా ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం



**ఒకటి తరువాయి** డిసీజెస్ ఆసుపత్రిలో ఎండో బ్రాంకియల్ అల్ట్రా సౌండ్ మెషీన్ తో వాటర్ ఫౌంటెన్ ల తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఈ అల్ట్రా సౌండ్ మిషన్ మొదటిదని,దీనివల్ల ఈ ప్రాంతంలోని ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతుం దన్నారు. గడిచిన రెండేళ్లలో ఆసుపత్రుల్లో ఓపి , ఐపి సేవలు గణనీయంగా పెరిగాయన్నారు. ఈ చెస్ట్ ఆసుపత్రి లో 2023లో 35,000గా ఉన్న ఓపి సేవలు 2025 నాటికి 45,000కు చేరుకున్నాయని, మేజర్ సర్జరీల సంఖ్య 359 నుండి 649కి పెరగడం డాక్టర్ లు ,సిబ్బంది అంకితభావానికి నిదర్శనం అని అన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నామని, కర్నూలు, విశాఖపట్నం, కడప మరియు గుంటూరులలో అత్యాధునిక క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి కాకినాడ మరియు అనంతపురంలో కూడా కాంప్రహెన్సివ్ క్యాన్సర్ సెంటర్లను పూర్తి చేసి క్యాన్సర్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా కృషి చేస్తామన్నారు. ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్య సేవ) కింద నిధులను భారీగా పెంచడం జరిగిందని. గతం లో 6 లక్షల రూపాయలుగా ఉన్న చెల్లింపులు ఇప్పుడు 3 కోట్ల 76 లక్షలకు పెరిగాయన్నారు. దీనిని బట్టి ప్రభుత్వ ఆసుపత్రుల పై, డాక్టర్లపై ప్రజల లో నమ్మకం పెరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రతి మూడు రోజులకు ఒక కొత్త డయా లసిస్ మిషన్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ?డయాలసిస్ మిషన్ల సంఖ్యను 55 0 నుండి 725కు పెంచి కిడ్నీ బాధితులకు భరోసా కల్పిస్తున్నామన్నారు. త్వరలోనే ప్రతి కుటుంబానికి 25 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పించేలా 'యూనివర్సల్ హెల్త్ స్కీమ్'ను అమలు చేయబోతున్నా మని, ఇంతటి భారీ స్థాయిలో ఉచిత వైద్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు ఏమాత్రం తీసిపోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ పరికరాన్ని సమకూర్చిన ఆసుపత్రి యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా పరిపాలనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, ముఖ్యంగా ఆరోగ్య రంగంలో విశాఖపట్నం ఆదర్శంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కొత్త పరికరం ద్వారా పల్మనరీ మెడిసిన్ విభాగంలో విశాఖ మరో మైలురాయిని సాధించిందన్నారు. ఈ సదుపాయాన్ని సమర్థవంతంగా వినియోగించి,అధిక సంఖ్యలో పరీక్షలు,చికిత్సలు నిర్వహించి, ఉత్తమ పద్ధతులను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా, సిఎస్ఆర్ ద్వారా మరిన్ని వనరులను సమీకరించి ఆసుపత్రుల్లో అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు జిల్లా పరిపాలన కృషి చేస్తుందని తెలిపారు. ఇందుకోసం వైద్యులు, సంబంధిత సంస్థలు తమ అవసరాల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. దేశీయ, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాల ద్వారా విశాఖపట్నాన్ని గ్లోబల్ నగరంగా మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్,రవి కుమార్ ,డా. పుల్లారావు,చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండ్ సునీల్ కుమార్,ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యారాణి, కె.జి.హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, డిఎంహెచ్వో డా. జగదీశ్వరరావు, డా. రమేష్,ఇతర వైద్య నిపుణులు సిబ్బంది పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



**పెందుర్తి , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** మతిస్థిమితం లేని బాలుడు రోడ్లపై తిరుగుతుండగా పోలీసులు గుర్తించి విచారించి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపగుంట జంక్షన్ వద్ద గస్తీ నిర్వహిస్తున్న సమయంలో బ్లూ కోట్ కానిస్టేబుల్ గోవింద్ సుమారు 10--11 సంవత్సరాల వయస్సు కల బాలుడు అనాధగా, అయోమయ స్థితిలో తిరుగుతున్నట్లు గమనించారు.తక్షణమే అప్రమత్తంగా స్పందించిన కానిస్టేబుల్ గోవింద్ ఆ బాలుడిని రక్షణలోకి తీసుకుని, పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి సంరక్షించారు. ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ కె.వి. సతీష్ కుమార్ మార్గదర్శకత్వంలో బాలుడి వివరాలు తెలుసుకునేందుకు చర్యలు చేపట్టగా, అతని ఫోటోను సోషల్ మీడియా ఇతర ముఖ్యమైన గ్రూపులలో షేర్ చేశారు. ఈ క్రమంలో, ఆ బాలుడు శ్రుజన్ జోయల్ (11 ), టీచర్స్ లేఅవుట్, సుజాత నగర్, పెందుర్తి అని గుర్తించారు. అనంతరం విచారణలో, బాలుడు మానసిక వికాసం సరిగా లేనివాడని, ఆదివారం కేర్ టేకర్ సెలవులో ఉండటంతో ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు తండ్రి తెలిపారు .అనంతరం, బాలుడి తండ్రి పోలీస్ స్టేషన్‌కు హాజరై, అవసరమైన నిర్ధారణ అనంతరం బాలుడిని సురక్షితంగా ఆయనకు అప్పగించడం జరిగింది.ఈ సందర్భంగా కానిస్టేబుల్ గోవింద్ చూపిన చురుకుదనం, మానవతా దృక్పథం ప్రజల ప్రశంసలను పొందింది. సొంత పిల్లాడిలా భావించి వెతికి, రక్షించి కుటుంబానికి అప్పగించిన ఆయన సేవలు అభినందనీయమైనవి .ప్రజల భద్రతకు, సేవకు పెందుర్తి పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నారు.

# ఎన్ హెచ్ 516 ఈ రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ నిషాంతి



**జి మాడుగుల, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారి (ఎన్ హెచ్ 516ఈ ) విస్తరణ తో అనుసంధాన రహదారుల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిషాంతి. టి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆమె జి.మాడుగుల మండలంలో పర్యటించి, ఎన్ హెచ్ 516 ఈ రోడ్డు జరుగుతున్న పనుల తీరును పరిశీలించారు. జి.మాడుగుల నుండి ఉరుము జంక్షన్ వరకు, అలాగే డి.గొందూరు బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాకపోకలకు ఇబ్బంది కలగకుండా నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా బైపాస్ రోడ్ల నిర్మాణం వల్ల ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని, వర్షాకాలం ప్రారంభం కాకముందే కీలకమైన పనులన్నీ పూర్తి చేయాలని సైట్ ఇంజనీర్ లోకేష్ కు,కాంట్రాక్టర్లకు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సైట్ ఇంజనీర్ ఈ పనులన్నీ నవంబర్ నాటికి పూర్తి జరుగుతాయని వివరించారు. నాణ్యతలో రోడ్డు నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు జరగాలి. నిర్ణీత కాలపరిమితిలోగా ఉడుము జంక్షన్ తో పాటు బైపాస్ రోడ్డు పనులను ముగించాలని తెలియజేశారు. ప్రజల సౌకర్యార్థం నిర్మాణ సమయంలో ప్రయాణికులకు, స్థానిక ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలిని తెలిపారు. ఎన్ హెచ్ 516 ఈ రోడ్డు పనులపై పూర్తి వివరాలు తో సంబంధించిన అధికారులు ప్రణాళికల రూపొందించుకొని,సోమవారం పాడేరు కలెక్టరేట్ కు రావాలని ఈ పనులు సంబందించిన, కాంట్రాక్టర్స్, ఇంజనీరింగ్ సిబ్బంది సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.జి.మాడుగుల నుండి నేరుగా కొత్తపల్లి జలపాతానికి చేరుకొని పరిశీలించారు. టూరిస్ట్ అధికారులతో టూరిస్టుల తాకిడి వాటర్ ఫాల్స్ వద్ద మౌలిక సదుపాయాలపై సంబంధిత టూరిజం, రెవిన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్కూల్ పిల్లలకు వేసవి సెలవుల కావడం వల్ల పిల్లలు వారి తల్లిదండ్రులు,పెద్దలు ఎక్కువ సంఖ్యలో వాటర్ ఫాల్స్ లకు వస్తారని, వారి వారి పిల్లలకు తల్లిదండ్రులే బాధ్యత వహించాలని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వాటర్ ఫాల్స్ లో అనుమతులు లేని ప్రదేశాలకు అనుమతించాలని అలాంటివి ఉంటే ముందుగానే టూరిస్టులకు తెలియజేయాలని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేని వాటర్ పార్క్ లో ఉంటే అలాంటి నిషేధిత ప్రాంతాలలో పిల్లలు వెళ్ళరాదని వారి తల్లిదండ్రులకు స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సిబ్బంది ముందుగానే గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలి. రెవిన్యూ,టూరిజం,ఫారెస్ట్ పంచాయతీరాజ్ అధికారులు కమిటీగా ఏర్పడి వచ్చే టూరిస్టులకు అవగాహన కల్పించాలన్నారు.?ఈ కార్యక్రమంలో సైట్ ఇంజనీర్ లోకేష్, టెక్నికల్ స్టాఫ్ టీం లీడర్ శ్రీనివాస్, రవికుమార్, మండల రెవెన్యూ సర్వేయర్ మోహన్ రావు, వీఆర్వో సింహాచలం బంధిత శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది , నిర్మాణ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## నాతవరం మండలంలో కోడి పందాల స్థావరంపై దాడి : తొమ్మిది మంది అరెస్టు



**అనకాపల్లి (నాతవరం), ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :**అనకాపల్లి జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ మరియు నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ పి.శ్రీనివాసరావు గారి ఆదేశాల మేరకు, నర్సీపట్నం రూరల్ సర్కిల్ సిఐ రేవతమ్మ గారి పర్యవేక్షణలో నాతవరం పోలీసులు జూదరులపై ఉక్కుపాదం మోపారు. నాతవరం మండలం, వీబీ అగ్రహారం గ్రామంలో జరుగుతున్న మాసమ్మ తల్లి జాతరను ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు రహస్యంగా కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు నాతవరం ఎస్సై వై.తారకేశ్వరరావు మరియు వారి సిబ్బంది ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడిపందాలు ఆడుతున్న తొమ్మిది మంది (09) వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి ఈ క్రింది వాటిని స్వాధీనం చేసుకున్నారు: నగదు: ?8,500/- కోడిపుంజులు: 04 ఈ సందర్భంగా ఎస్సై తారకేశ్వరరావు గారు మాట్లాడుతూ, పండుగలు లేదా జాతరల పేరుతో చట్టవిరుద్ధమైన జూదక్రీడలు, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**అచ్యుతాపురం , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** ఓం శ్రీ సాయిరాం, భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి దివ్య ఆశీస్సులు తో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు అనకాపల్లి జిల్లా జోన్ 1 వారి ఆధ్వర్యంలో చలివేంద్రం,(ఐ,ఓ,బి బ్యాంక్ అచ్యుతాపురం ఎదురుగా) మజ్జిగ మంచినీరు సేవా కార్యక్రమం కే.ఎస్.ఎన్ రాజు , మండల వికలాంగుల పాఠశాల అధినేత పట్నాయక్ చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన తో శిబిరం ప్రారంభించబడినది. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికల్ ఇంచార్జ్ కె. ఆది నాగేశ్వరావు, పాండురంగారావు ఎస్ .చంద్రశేఖర్ కన్వీనర్ ఎం గణేష్, బి శ్రీను, ఎం.అప్పల నాయుడు , బి సత్య రామ్, కె అరుణ్ కుమారి, కొలగాని నూకరత్నం, సత్యవతి లక్ష్మీ , పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులు ,ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దివిస్ ఆధ్వర్యంలో ఆటిజం అవగాహన ర్యాలీ



**భీమునిపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** మండలంలోని చిప్పాడ దివిస్ లాబొరేటరీస్ లిమిటెడ్, కంపెనీ డైరెక్టర్ దేవేందర్, వైస్ ప్రెసిడెంట్ ఎల్.వి. రమణ మరియు 600 మంది ఉద్యోగులతో కలిసి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత భాగ్చీ ఆటిజం అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న దివిస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్ ప్రెసిడెంట్ డా. ప్రమోద్ మాట్లాడుతూ ఆటిజం అనేది ఒక సంక్లిష్టమైన నాడీ సంబంధిత అభివృద్ధి లోపమని, ఇది ప్రధానంగా జన్యుపరమైన కారకాలు, మెదడు అభివృద్ధిలో తేడాలు మరియు పర్యావరణ ప్రభావాల కలయిక వల్ల సంభవిస్తుందని చెప్పారు. 60-90 శాతం కేసులలో జన్యువులు పాత్ర పోషిస్తుండగా, గర్భధారణ సమయంలో ఎదురయ్యే సమస్యలు కూడా ఒక కారణంగా ఉండవచ్చని తెలిపారు. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అనేది బాల్యంలోనే ప్రారంభమయ్యే ఒక మానసిక రుగ్మత. దీనికి రోగ నిర్ధారణ అవసరమని, ఇలాంటి పిల్లలతో పనిచేసే శ్రేయ ఫౌండేషన్ కార్యదర్శులు ఉషా దేవి మరియు సుదీష తెలిపారు. ఆటిజం లక్షణాలను సులభంగా గుర్తించడం ద్వారా, తల్లిదండ్రులు బాధితులకు చిన్నతనం నుంచే అవసరమైన మద్దతును అందించగలరని, అలాగే సంభాషణ, సామాజిక సంబంధాలలో ఇబ్బందులు, దేనిపైనా ఆసక్తి లేకపోవడం మరియు పునరావృత ప్రవర్తనలతో కూడిన ఆటిజం లేదా ఆస్పెర్గర్ సింద్రోమ్‌ను ఎదుర్కోవడంలో వారికి అండగా నిలబడగలరని వారు తెలిపారు. అంతర్జాతీయంగా ఆటిజం మాసంగా గుర్తించబడిన ఏప్రిల్ నెలలో, సమాజంలో ఆటిజంపై అవగాహన కల్పించడం, ఈ సమస్యతో బాధపడుతున్న వారిని సమాజంలో భాగం చేయడం మరియు సానుకూల ఆలోచనలతో ఆమోద భావాలను పెంపొందించడం వంటి లక్ష్యాలతో, ప్రతి సంవత్సరం దివ్యాంగులు మరియు వృద్ధుల సంక్షేమ శాఖ సహకారంతో తాము ఒక అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు దివిస్ ల్యాబ్స్ జనరల్ మేనేజర్లు వై.ఎస్.కోటేశ్వర రావు మరియు ప్రద్యుమ్న తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దివిస్ ఉద్యోగులు మరియు ఆటిజం ఉన్న పిల్లల తల్లిదండ్రులు, ఆటిజం ఉన్న పిల్లలతో సహా, పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# శ్రీకాకుళం నగర పరిధిలో డ్రోన్ నిఘా







**శ్రీకాకుళం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** శ్రీకాకుళం ఒకటవ మరియు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని అరసవిల్లి, ఖాజీపేట, భైరవానిపేట, శాంతినగర్ కాలనీ, నాగావళి రివర్ వ్యూ పార్క్, బలగ తదితర నది పరివాహక ప్రాంతాలు మరియు పట్టణ చివర ప్రాంతాలలో నిర్మానుష్య ప్రదేశాలలో డ్రోన్ నిఘా ఏర్పాటు చేయడం జరుగుతోంది.జిల్లా ఎస్పీ కే.వి. మహేశ్వర్ రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆదివారం శ్రీకాకుళం పట్టణ పోలీస్ స్టేషన్ లు పరిధిలో పరిసర ప్రాంతాలలో బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ తదితర నేరాలను అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ నిర్వహించారు.పాడుబడిన భవనాలు, ఖాళీ ఇళ్లు మరియు అనుమానాస్పద ప్రదేశాలపై డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరణ చేపట్టడం జరిగింది. బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారు గుర్తించబడిన పక్షంలో, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కే.వి. మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.





**గాజువాక శాసన సభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అనపర్తి ఆర్.ఎం.జి.లే ఔట్ లో జరిగిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణ రెడ్డి కుమార్తె మరియు పాణ్యం శాసన సభ్యులు గౌరు చరితరెడ్డి కుమారుడు వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.**

**ఈ సందర్భంగా వధూవరులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.**

**ఏప్రిల్ 12 ( మనం న్యూస్ )**

## ఘనంగా అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు



**భీమునిపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** భీమిలి మార్కెట్ కమిటీ ఎదురుగా గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కాలనీలో ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలు ఉత్తరాంధ్ర దళిత నాయకులు భాగం గోపాలరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన తగరపు వలస ఎలక్ట్రికల్ ఏఈ బొట్ట రవి, రెండో వార్డు మాజీ కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, టిడిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, టిడిపి పార్టీ మూడో వార్డ్ అధ్యక్షులు గోలగాని నరేంద్ర ప్రముఖ అంబేద్కర్ వాది గోడి నాగేశ్వరరావు, సుజాత దంపతులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం గోడి నాగేశ్వరరావు బుద్ధవందనం తో సభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎలక్ట్రికల్ ఇంజనీర్ బొట్టా రవి మాట్లాడుతూ విభిన్న కులాలు విభిన్న మతాలు గల సువిసాల భారతదేశానికి భారత రాజ్యాంగాన్ని రచించిన మహోన్నతమైన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు.

పిమ్మట స్వర్గీయ ఉండ్రు శ్రీనివాస రావు, స్వర్గీయ ఉండ్రు పార్వతి గార్ల జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు గోడి నాగేశ్వరరావు, గోడి సుజాత వారి కుమార్తెలు డాక్టర్ గోడి సంఘమిత్ర, గోడి శ్రీ మిత్ర, గోడి సుమిత్ర గార్ల ఆర్థిక సహాయంతో గత సంవత్సరం 10వ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన 14 మంది విద్యార్థినీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు.

అలాగే 30 మంది దళిత మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ సూపర్నెంట్ జి. అప్పారావు, నాయకులు చిల్ల కరుణాకర్ రెడ్డి, కనకల అప్పలనాయుడు, బోని సన్ని బాబు, సియ్యాద్రి రాంబాబు, మామిడి శివ, మద్దెల తీన్ మూర్తి, పారుపల్లి నర్సింగరావు, రవ్వ ఈశ్వరరావు, బోని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# చలో తర్లువాడ

## గూగుల్ డేటా సెంటర్ భూ బాధితుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రతిఘటన
## గూగుల్ కు దేవస్థానం భూమి కేటాయించినపుడు లేని సమస్య పంచగ్రామాలకు ఎందుకు

**విశాఖపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** గూగుల్ డేటా సెంటర్లో భూములు కోల్పోయిన దళితులు, రైతుల సమస్యలు ఈ నెల 25లోగా పరిష్కరించకపోతే చలో తర్లువాడ కార్యక్రమం చేపడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. ఏప్రిల్ 28న చేపట్టే గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపనను ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.విశాఖ నగరం, పిఠాపురం కాలనీలోని ఏచూరి భవన్ (సిపిఎం జిల్లా కార్యాలయం)లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 520 మంది రైతులకు పరిహారం చెల్లించకుండా, తర్లువాడ, అడవివరం, రాంబిల్లి మండలంలో బలవంతంగా 601 ఎకరాల భూములు తీసుకొని గూగుల్ కు కేటాయించడం అన్యాయమన్నారు. గూగుల్ బ్రాండ్ పేరుతో 601 ఎకరాలను అదానీ కంపెనీకి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయనుందని తెలిపారు. పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక తయారుచేయకుండా, సామాజిక అధ్యయనం నిర్వహించకుండా, విశాఖ ప్రజలకు తాగునీటి సరఫరాపై స్పష్టత ఇవ్వకుండా గూగుల్ డేటా సెంటర్ కు శంకుస్థాపన ఎలా చేస్తారని ప్రశ్నించారు. గూగుల్ డేటా సెంటర్ పై ప్రజల మదిలో మెదులుతున్న సందేహాలకు సమాధానం చెప్పకుండా ఉద్యోగాలొస్తాయని ఆశచూపి, భ్రమలు పెట్టడం న్యాయం కాదన్నారు.డేటా సెంటర్ లో ఐదారువేల కంటే ఎక్కువ ఉద్యోగాలు రావని కేంద్రమంత్రులు చెబుతుంటే, లక్ష 50వేల ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం చెప్పడం మోసం కాదా? అని శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఈ పరిమితి ఉద్యోగాల్లో ఎంతమంది స్థానికులకు ఉద్యోగాలు వస్తాయి? ఉత్తరాంధ్ర ప్రజలకు వచ్చిన ప్రయోజనమేమిటో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గూగుల్ కు కేటాయించిన భూమిపై సేల్ డీడ్ ద్వారా అదానికి పూర్తి యాజమాన్య హక్కు కల్పించడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రూ. 1.2 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టగలిగిన అతి పెద్ద గూగుల్ సంస్థకు కరెంట్, రోడ్లు, నీరు, ట్యాక్స్ ఫ్రీ వంటి సదుపాయాలు, 22వేల కోట్లు రాయితీ ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. తర్లువాడలో ఎవరూ ప్రవేశించకుండా పోలీసులు అడ్డుకోవడంతో, గూగుల్ రావడం ఇష్టంలేక పబ్బం గడుపుకోవడానికి ప్రభుత్వం ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నట్లు భావించాల్సివస్తోం దన్నారు. చిత్తశుద్ధి వుంటే ప్రజల అభివృద్ధి, భద్రతకు ప్రాధా న్యత ఇచ్చి బాధితుల సమస్యలు పరిష్కరించి, జవాబుదా రీతనంగా ప్రభుత్వం వ్యవహరించేది అన్నారు.తన సొంత నియోజకవర్గంలో భూములు కోల్పోయిన రైతులు, దళితులకు పరిహారం ఇప్పించకుండా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్పొరేట్ సేవలో తరిస్తున్నట్లుందని వ్యాఖ్యానించారు. డేటా సెంటర్ తో ఉష్ణోగ్రత ఒక డిగ్రీ పెరుగుతుందని, విశాఖలో ఢిల్లీ కంటే వేడి ఎక్కువగా వుంటుందని పర్యావరణ నిపుణులు చెబుతున్న విషయం గుర్తుచేశారు. కార్పొరేట్ల కోసం విశాఖ ప్రజల ప్రాణాలను ప్రభుత్వం ఫణంగా పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**గూగుల్ కు లేని సమస్య పంచగ్రామాలకు ఎందుకు?**

సింహాచలం దేవస్థానం భూమి 160 ఎకరాలు గూగుల్ డేటా సెంటర్ కు కేటాయించినప్పుడు అడ్డురాని దేవాదాయ చట్టం, పంచగ్రామాల ప్రజల ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు ఎందుకు అడ్డొస్తుందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే పంచగ్రామాల ప్రజల ఇళ్ల స్థలాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదరిక నిర్మూలనకు పెట్టిన పి 4ను పక్కనబెట్టి, అసంతృప్తితో వున్న టిడిపి కార్యకర్తలను సంతృప్తిపర్చేందుకు ఈ 3ని చంద్రబాబు ప్రవేశపెట్టారని అన్నారు. ప్రజలను గాలికొదిలేసి, కొద్దిమంది టిడిపి కార్యకర్తలు లబ్ధిపొందేలా సంపాదించుకోండి, తినండి, పదవులు పొందండి అని ఈ 3ని పెట్టారన్నారు. కార్పొరేట్ సంస్థలు తమ భూములు అమ్ముకోవడానికి, బ్యాంకు రుణాలు తెచ్చుకొనేలా కాకుండా, 22ఎ నుంచి సాధారణ రైతుల భూములను తొలగించడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు అమ్ముకోవచ్చని చెప్పడం వెనుక వాటిని కొల్లగొట్టుకోవడానికి వేస్తున్న ఎత్తులని అని అన్నారు. పేదలకు ఆస్తులపై శాశ్వత హక్కు కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు జోన్లలో ప్రత్యేకంగా సీతంపేట నుంచి ఎటపాక వరకు గిరిజన మండలాలతో కలిపి కలిపి ఒక జోన్ ఏర్పాటుచేసి గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కార్మిక సంక్షేమంపై ప్రత్యేక మంత్రివర్గ సమావేశం ఏర్పాటుచేసి వారి సంక్షేమం, వేతన పెంపుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ కెఎస్ వి కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.




# విశాఖలో వార్డుల విస్తరణకు శ్రీకారం

- వార్డులు పెంపు దిశగా చర్యలు
- పరిపాలనా పునర్వ్య స్వీకరణకు అడుగులు
- కేంద్ర జి.ఓ.తో గ్రామీణ మండలాల విలీనానికి బ్రేక్

**ఆనందపురం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నం మహానగర పరిధిలో పరిపాలనా వికేంద్రీకరణకు దోహదపడే విధంగా వార్డుల పునర్విభజన ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఉన్న 98 వార్డులను 120 వార్డులుగా విస్తరించేందుకు ప్రాథమిక చర్యలు ప్రారంభమైనట్లు విశ్వసనీయ సమాచారం.నగర జనాభా పెరుగుదల, ప్రాంతాల విస్తరణ, ప్రజా సేవల సమర్థవంతమైన అమలు వంటి అంశాల ను దృష్టిలో ఉంచుకుని ఈ పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విభజనలో భాగంగా మధురవాడ, భీమిలి, తగరపువలస, విశాఖ నగర ప్రధాన ప్రాంతాలు, గాజువాక పరిధిలోని పలు ప్రాంతాలను పునర్విభజనలో చేర్చే ప్రతిపాదన లు రూపొందుతున్నాయి. స్థానిక అవసరాలు, భౌగోళిక పరిమాణం, జనసాంద్రత వంటి ప్రమాణాల ఆధారంగా కొత్త వార్డుల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు సంకేతాలు ఇస్తున్నారు. అయితే, ఈ ప్రక్రియలో గ్రామీణ మండలాల విలీనంపై కేంద్ర ప్రభుత్వ నిబంధనలు కీలక పాత్ర పోషిస్తున్నా యి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ప్రకారం దేశవ్యాప్తంగా జనగణన పూర్తయ్యే వరకు గ్రామీణ మండలాలను పట్టణ పరిపాలనా వ్యవస్థలో విలీనం చేయడానికి అనుమతి లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీనితో ఆనందపురం, భీమిలి రూరల్, పద్మనాభం మండలాలను నగర పరిధిలో కలపాలన్న ప్రతిపాదనలు ప్రస్తుతం నిలిచిపోయాయి. కేంద్ర నిబంధనల కారణంగా ఈ మూడు మండలాల విలీన ప్రక్రియ ముందుకు సాగలేకపోయిందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా, వార్డుల సంఖ్య పెంపు ద్వారా స్థానిక సమస్యల పరిష్కారం వేగవంతం కావడంతో పాటు ప్రజలకు మరింత చేరువలో పరిపాలన అందించవచ్చని భావిస్తున్నారు. మరోవైపు, గ్రామీణ మండలాల విలీనంపై ఉన్న పరిమితులు తొలగితే భవిష్యత్తులో నగర విస్తరణ మరింత వేగం అందుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మొత్తంగా, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నగర అభివృద్ధి, పరిపాలనా సౌలభ్యం మధ్య సమతుల్యత సాధించే దిశగా అధికారులు జాగ్రత్తగా ముందడుగులు వేస్తున్నారు. విశాఖ నగర రూపురేఖలు మారనున్న ఈ పునర్విభజన ప్రక్రియపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

# మంట కలిసిన ఏయు ప్రతిష్ట..!!

- నడిరోడ్డుపై అశ్లీల పాటలకు డ్యాన్సులు
- ఇదేమి సంస్కృతి అంటున్న మేధావులు
- ఏయూ పరువుకు పరాకాష్ట




**ఆనందపురం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు ఆదిలోనే మంట కలిశాయి. సాక్షాత్ ఏయూ వైస్ ఛాన్సలర్ రాజశేఖర్ సమక్షంలో ఈ చర్యలు చేపట్టడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు. శతాబ్ది ఉత్సవాల పేరుతో నడిరోడ్లపై వీధి డాన్సర్లుగా మారుస్తూ విద్యార్థుల చేత డాన్సులు చేయించడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. వందేళ్ళ ఘన చరిత్ర కలిగిన ఆంధ్ర యూనివర్సిటీ ఈ నెల 11 నుండి ఉత్సవాలు ప్రారంభించింది. అయితే డాన్స్ బేబీ డాన్స్ పేరుతో అశ్లీల పాటలకు విద్యార్థులను ప్రేరేపించి నృత్యాలు చేయించడం పట్ల మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఏయూ పరువు ప్రతిష్టలు దిగజారుతున్నాయనే అంశం తెర మీదకు వచ్చింది. ప్రపంచానికి ఎంతోమంది మేధావులను అందించిన ఆంధ్ర యూనివర్సిటీ నిర్వాకంపై సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలపై మేధావి వర్గం పెదవి విరుస్తుంది. ఇకనైనా ఏయూ పాలకవర్గం సరైన పంథాలో నడవాలని, ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలంటే కొంతమంది సూచనలు సలహాలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావి వర్గం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

# శిశు ఆరోగ్యంపై కేంద్రం కఠిన నిర్ణయం..!! దగ్గు సిరప్‌లపై ఆంక్షలు



**ఆనందపురం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** ప్రపంచవ్యాప్తంగా కల్తీ మందుల ముప్పు నేపథ్యంలో కీలక చర్యలు..... దేశవ్యాప్తంగా శిశువుల ఆరోగ్య రక్షణకు ప్రాధాన్యతనిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా దగ్గు సిరప్‌లు, జలుబు నివారణ మందుల వినియోగంపై కఠిన నియంత్రణలు విధించేందుకు చర్యలు ప్రారంభించింది. రెండేళ్ల లోపు పిల్లలకు వైద్యుల సూచన లేకుండా దగ్గు సిరప్‌లు వాడకూడదని, ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ తరహా మందుల వినియోగాన్ని గణనీయంగా పరిమితం చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఇటీవల కల్తీ దగ్గు సిరప్‌ల వినియోగం కారణంగా భారత్‌తో పాటు పలు దేశాల్లో చిన్నారుల మరణాలు నమోదైన ఘటనలు ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు దారితీశాయి. ఈ నేపథ్యంలో శిశు వైద్యరంగంలో భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉద్భవించింది. అనారోగ్య లక్షణాలు స్వల్పంగా ఉన్నప్పటికీ తల్లిదండ్రులు స్వచ్ఛందంగా మందులు వినియోగించడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల దృష్ట్యా ఇండియా ఫార్మాకోపియా కమిషన్ (ఐపీసీ) సమగ్ర మార్గదర్శకాల రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. డ్రాఫ్ట్ నిబంధనల ప్రకారం వైద్యులు, ఫార్మాసిస్టులు మరింత జాగ్రత్తగా ప్రిస్క్రిప్షన్ విధానాలు పాటించాల్సి ఉంటుంది. ముఖ్యంగా శిశువుల వయస్సు, బరువు, ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని మాత్రమే మందులు సూచించాలనే నిబంధనలు అమల్లోకి రానున్నాయి. వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, చిన్నారుల శరీర నిర్మాణం సున్నితంగా ఉండటంతో సాధారణంగా పెద్దలకు ఇచ్చే మందులు వారికి ప్రమాదకరంగా మారే అవకాశముంది. ముఖ్యంగా దగ్గు సిరప్‌లలో ఉండే కొన్ని రసాయన పదార్థాలు శ్వాసకోశ సమస్యలను పెంచడవే కాకుండా ప్రాణాపాయ పరిస్థితులకు దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఫార్మాస్యూటికల్ రంగంలో నాణ్యత నియంత్రణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. కల్తీ మందుల తయారీ, సరఫరాపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ఇలాంటి విషాద ఘటనలను నివారించగలమని పేర్కొం టున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం శిశు ఆరోగ్య సంరక్షణలో ఒక మైలురాయిగా భావించ బడుతోంది. తల్లిదండ్రులు కూడా వైద్యుల సూచన లేకుండా చిన్నారులకు ఎటువంటి మందులు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యవర్గాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. శిశువుల ప్రాణభద్రతే ప్రథమ లక్ష్యం గా నిబంధనల కఠిన అమలు ద్వారా ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని కేంద్రం సంకల్పించింది.

# పన్నెండ లో విషాదం....
## ఈతకు వెళ్లిన చిన్నారులు మృతి





**పెదబయలు, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** వేసవితాపానికి చల్లబరుచుకునేందుకుగాను ఈతకు వెళ్లిన ముగ్గురు చిన్నారులు గడ్డలో మునిగి చనిపోయిన సంఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలో చోటుచేసుకుంది. పెదబయలు మండలంలోని సేకరి పంచాయతీ 12 గ్రామానికి చెందిన కూడా ప్రదీప్ (10), పాంగి బాబులు ( 10), గల్లోంగి హర్షిత్ (11), తో పాటు మరో ఇద్దరు చిన్నారులు కలిసి మొత్తం ఐదు మంది ఆదివారం సమీప మచ్చ గడ్డలో మధ్యాహ్నం ఈతకు వెళ్లారు. ఈత కొడుతూ ప్రమాదవసత్తు కూడా ప్రదీప్ పాంగిబాబులు గొల్లంగి హర్షిత్ మృతిచెందగా కోడా కార్తీక్, పాంగి నవీన్ బయటపడ్డారు. చిన్నారులు ఈతకు వెళ్లి మృతి చెందడంతో గ్రామం ఒక్కసారి శోక సముద్రంలో మునిగిపోయింది. చిన్నారులు మృతి చెందడంతో ఆ కుటుంబీకుల రోజున వర్ణానతీతం. ఈ సంఘటనపై ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పెదబయలు మండలం,ఏకలవ్య స్కూల్ కు దగ్గరలో ఉన్న మత్యగడ్డలో,సీకారి పంచాయితీ,పన్నెండ గ్రామానికి చెందిన మొత్తం ఐదు గురు పిల్లలు ఇతకు వెళ్లి, ప్రమాదవశాత్తు ముగ్గురు పిల్లలు మునిగి చనిపోగా,ఇద్దరు పిల్లలు బయట పడ్డారు. తల్లిదండ్రుల పిర్యాధి మేరకు పెదబయలు పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడమైనది.బయట పడ్డ పిల్లలు, కొడ కార్తీక్,పాంగి నవీన్

# మహిళలకు చట్టసభలలో ప్రాధాన్యత ఇచ్చే బిల్ ప్రవేశపెడతాం
## - ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్



**విశాఖపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** నారి శక్తి వందనం అధినియం పేరిట మహిళలకు చట్ట సభ లో ప్రాధాన్యత ఇచ్చే బిల్ ప్రవేశ పెడతామని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ తెలిపారు. స్థానిక భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ఎం ఎం పరశురామరాజు అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.ఈ నెల 17,18 తేదీల్లో పార్లమెంట్ లో చర్చ జరుపుతా రన్నారు.దేశంలో ఏబై శాతం మహిళలు ఉన్నా, కేవలం 13 శాతం మాత్రమే చట్ట సభ ల్లో ప్రాధాన్యత ఇస్తున్నామనీ.స్థానిక సంస్థల్లో 33 శాతం అవకాశం ఇస్తే రుజువు చేశారు. జనధన్ అకౌంట్లు అందిస్తే ఆర్థిక పరిపుష్టి చూపించారు. స్టాండ్ అప్ ఇండియా , స్టార్ట్ అప్ ఇండియా లో లక్ష కు పైగా అకౌంట్లు మహిళలు సాధించారు.మహిళా సాధికారణ అంటే మాటల్లోనే కాదు చేతల్లో చూపించాలని ఎన్‌డిఏ కూటమి అనుకుంటోందనీ.మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ విజయవంతం అవ్వాలని కోరుకుంటున్నానన్నారు. వచ్చే ఎన్నికల నుంచే అమలు జరపాలని ముందుకు సాగుతాం. ప్రజల తో తిరస్కరించిన వ్యక్తులు మాట్లాడుతున్నారు. వంద సీట్లు దాటలేని కాంగ్రెస్ మాట్లాడటం దారుణం. ఇక రాష్ట్రంలో గూగుల్, ఆర్సేలార్ మిట్టల్ తెచ్చింది తామే అని వైసీపీ నేతలు చెప్తున్నారు భోగాపురాన్ని ఐదేళ్లు వదిలేసి రోడ్లు కూడా వెయ్యలేధని,వైసిపి నాయకులు ఇప్పుడు భోగాపురం మాదే అంటున్నారు.వెస్ట్ బెంగాల్ లో మనతాను ఇంటికి పంపుతాం.తమిళనాడులో స్టాలిన్ పాలన లో శాంతి భద్రత బాగోలేదుడి ఎం కె నేతలను హత్య చేశారు.కుటుంబ పాలన తో దోచుకున్నారు. కనుక తమిళనాడు లో పాలనమారుతుంది.వెస్ట్ బెంగాల్ ఖరగ్ పూర్ లో పవన్ కళ్యాణ్ ప్రచారం కోసం రావాలని డిమాండ్ ఉంది. ఎన్నికలు జరుగుచున్న ప్రాంతాల్లో తెలుగు వారు ఉన్న చోట కూటమి అగ్ర నాయకులు ప్రచారం చేస్తారు. ఈ కార్యక్రమంలో బిజెపి శాసనసభ పక్ష నేత శ్రీ పి విష్ణుకుమార్ రాజు , టిడిపి జిల్లా అధ్యక్షులు సిహెచ్ పట్టాభి , బిజెపి రాష్ట్ర కార్యదర్శి యు సుజాత రాజ్, బిజెపి మహిళ అధ్యక్షురాలు ఎన్ జ్యోతి, టిడిపి మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి పాల్గొన్నారు.

# ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థి ఎప్పుడూ ఆగిపోకూడదు" : ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ

**రోలుగుంట , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం రోలుగుంట గ్రామంలో ఆదివారం ఐఐటీ, నీట్ కోచింగ్ సెంటర్ ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ చేతుల మీదుగా ఈ కోచింగ్ సెంటర్ను ప్రారంభించారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని, ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థి ఏ కారణం వల్ల కూడా స్టాప్ అవ్వకూడదని ఆయన స్పష్టంగా చెప్పారు. పేద, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల చదువు, ఎదుగుదల ఎప్పటికీ ఆగరాదని వారి భవిష్యత్తు కోసం తాను ఏ సహకారం అయినా అందివ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లల భవిష్యత్తు కోసం మంచి ఆలోచన చేసి ముందుకు రావాలని ఆయన కోరారు. ఐఐటీ, నీట్, ఎన్ఐటీ వంటి పోటీ పరీక్షల కోచింగ్ సాధారణంగా ఎక్కువ ఖర్చు కలిగి ఉంటుందని గుర్తు చేసిన ఆయన, పల్లె పిల్లలకు ఉచితంగా ఇటువంటి శిక్షణ అందించాలనేదే లక్ష్యమని చెప్పారు. ఈ కేంద్రం ద్వారా ప్రతి యోగ్య విద్యార్థికి ఫిజిక్స్ వాలా సౌజన్యంతో, "వేదా విద్యా" డైరెక్టర్ పోతల ప్రసాద్ నాయుడు సహకారంతో కలిసి ఐఐటీ, నీట్ కోచింగ్ ఉచితంగా అందించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రకటించారు. జాతీయ ఓబీసీ అధ్యక్షుడు పోతల ప్రసాద్ నాయుడు మాకవరపాలెం మండలాన్ని "దత్తత" తీసుకుని, ఇంకా ఎన్నో ప్రత్యేక విద్యా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

# సాంప్రదాయ బద్ధంగా బిట్రగండలో (బోడ్ బెంట్ ) పెద్ద వేట పండగ



**డుంబ్రిగుడ , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** మండలంలోని కొల్లాపుట్టు గ్రామ పంచాయితీ పరిధిలో గల బిట్రగండ గ్రామంలో ఆదివారం అంగరంగ వైభవంగా పూర్వికులు ఆచర సాంప్రదాయం బద్ధంగా జాంకర దేవుడు సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి కోడిగుడ్డు కొట్టి పెద్ద వేటకు బయలుదేరారు. ఈ పండుగ కు చుట్టుపక్కల గ్రామాల నుండి మహిళలు, యువతి యువత గిరిజనులు తరలి వచ్చి దింసా నృత్యాలతో సందడి చేశారు. పూర్వికులు చెప్పిన ఆసరా సంప్రదాయాల ప్రకారం అప్పటినుండి ఇప్పటివరకు గ్రామంలో ప్రతిఏటా ఇదే ఆచారం ఆనవైతిగా వస్తుంది.కోడి గుడ్డు కొట్టిన వ్యక్తికి ఆ స్థలం నుండి మహిళలు ఊరేగింపుతో గ్రామానికి తీసుకువచ్చి పసుపు కుంకుమతో నుదుటికీ తిలకించి 516 రూపాయలు ఫైన్ వేస్తారు. అనంతరం చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ కలిసి గ్రామంలో దింసా నృత్యాలతో సందడి చేస్తారు. ఈ పండగ అనంతరం విత్తనాలు వేసి వ్యవసాయ పనుల్లో నిమగ్నం అవుతారు.

# ఐఐటి నీట్ ఫలితాలు విడుదల చేసిన రిటైర్డ్ డిజిపి సత్యనారాయణ



**రోలగుంట, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** రోలుగుంట మండలంలో సమర్పణ ఫౌండేషన్ మరియు వేద విద్యా, ఫిజిక్స్ వాలా సంయుక్తంగా గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద కుటుంబ ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఐఐటి మరియు నీట్ కోచింగ్ మార్చి 29న పరీక్షలు నిర్వహించడం జరిగింది అలాగే పరీక్షల్లో ర్యాంకు సాధించిన వారికి ఆదివారం రిటైర్డ్ డిజిపి ఉత్తరప్రదేశ్ కిల్లాడ సత్యనారాయణ గారు చేతుల మీదుగా ఫౌండేషన్ చైర్మన్ రమణ ఆధ్వర్యంలో సన్మానం చేయడం జరిగింది దీనిలో భాగంగా బుచ్చింపేట గ్రామంలో మొట్టమొదటిగా విద్యలో పట్టా పొందిన గాలి ప్రసాద్ ని రిటైర్డ్ డీజీపీ(ఉత్తర ప్రదేశ్) కిల్లాడ సత్య నారాయణ గారు మరియు ప్రసాద్ నాయుడు గారి చేతుల మీదుగా సన్మానించడం జరిగింది. అదేవిధంగా ఇదే ప్రాంతానికి చెందిన అనిమిరెడ్డి రమణ వార్డు కార్యదర్శి మరియు సబ్బవరపు చంటి గారు సొంత నిధులతో ఏర్పాటు చేసిన సుమారు 200 బ్యాగ్స్ డ్వాక్రా మహిళలు కు, ఉపాధి హామీ వేతన దారులకు రిటైర్డ్ డీజీపీ ఉత్తర ప్రదేశ్ కిల్లాడ సత్య నారాయణ గారి చేతుల మీదుగా మరియు ప్రసాద్ నాయుడు గారు,వెలమ ఫౌండేషన్ చైర్మన్ రమణ మూర్తి చేతుల మీదుగా అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో సమర్పణ యాజమాన్యం,వేద విద్యాడైరెక్టర్ ప్రసాద్ నాయుడు గారు,ఫిజిక్స్ వాలా యాజమాన్యం మరియు వెలమ ఫౌండేషన్ చైర్మన్ రమణ మూర్తి పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు

# కాలువలు కబ్జా.. నిద్ర మత్తులో అధికార గణం





**ఆనందపురం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలం బంటుపల్లి వారి కల్లాలు పంచాయతీ పరిధిలో బీసీ కాలనీలో ప్రభుత్వ కాలువలను నాయకుల చొరవతో ఆక్రమణలు జరుగుతున్నాయని పలు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలను కాపాడవలసిన అధికారులు నిద్ర మత్తులో ఉన్నారా లేక ముడుపులు మాయలో ఉన్నారా అంటూ పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ స్థలాలను కాపాడవలసిన అధికారులు నిర్లక్ష కారణంగానే కాలువల కబ్జాలకు గురవుతున్నాయని, నిర్మాణాలు వెనుక రాజకీయ హస్తం ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. వర్షాధార కాలువలు కబ్జాలకు గురైతే భావితరాలకు నీటిలో తేలియాడే ఇల్లు దర్శనమిస్తాయని అలా జరగకుండా ఉన్నతాధికారులు ముందుగానే మేల్కొని వర్షాధార కాలువలను ప్రభుత్వ స్థలాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు




**పార్వతీపురం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి . మాధవ్ రెడ్డి, ఉత్తర్వుల మేరకు, అదనపు ఎస్పి ఎం. వెంకటేశ్వరరావు ఆదేశాలతో, పార్వతీపురం ఏఎస్పి మనీషా రెడ్డి సూచనల తో, పార్వతీపురం పట్టణ సిఐ వెంకట్రావు ఆధ్వర్యంలో పట్టణంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్(స్పెషల్ డ్రైవ్)తనిఖీలు నిర్వహించారు. పార్వతీపురం,కొత్తవలస ఎస్‌వి డి డిగ్రీకళాశాల ప్రాంతంలో పట్టణ సీఐ సిబ్బంది తో వాహన తనిఖీలు నిర్వహిస్తూ, ప్రజల భద్రతలో భాగంగా ప్రతీ వాహనాన్ని ఆపి వాహనాలు నడిపే వ్యక్తులకు బ్రీత్ అనలైజ్ ద్వారా తనిఖీలు చేపట్టి, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిమీద కేసులు నమోదు చేశారు. పట్టణ సీఐ ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని,మీ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ స్పెషల్ డ్రైవ్ లో సిఐ తో పాటు పట్టణ ఎస్సై ప్రయోగమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

# వేణు దత్త సువర్ణ లక్ష్మి దాంపత్య వ్రతం

### తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహణ



**విశాఖపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** పాత వెంకోజీపాలెం - హెచ్ బీ కాలనీ రోడ్ లో ఉన్న ఎంవివి ప్రెసిడెన్సీ ఆడిటోరియంలో.. ఆదివా రం.. వేణు దత్త సువర్ణ లక్ష్మి దాంపత్య వ్రతం నిర్వహించారు. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ - రాధిక దంపతుల ఆధ్వర్యంలో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో పాటు, బిజెపి అగ్రశ్రేణి నాయకుడు మురళీ మనోహర్ జోషి లాంటి ఎందరో ప్రముఖులు ఆశీర్వాదాలు పొందిన భగవాన్ రామదత్త వద్ద శిష్యరికం చేసిన ముగ్గురు గొప్ప వ్యక్తులతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

ప్రజలందరూ క్షేమంగా ఉండాలనే మంచి సంకల్పం కూడా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. తమ దంపతులతో పాటు 50 మంది దంపతులు మంగళప్రదమైన కంకణాలు కట్టుకుని పూజలు చేశారన్నారు. ఇదిలా ఉండగా మే10వ తేదీన హైదరాబాదులోని జడ్చర్ల వద్ద అవదూత భగవాన్ రామదూత స్వామి.. తన తపస్సును భక్తులకు ధారా దత్తం చేస్తారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొనే వారికి అన్ని కష్టాలు అడ్డంకులు తొలగిపోతాయని పేర్కొన్నారు. జడ్చర్లలో అవదూత స్వామివారి ఆశీస్సులను పొందాలని భావించేవారు తనను సంప్రదించాలన్నారు. అంతేకాకుండా ఆగస్టు మాసంలో విశాఖలో స్వామివారి ఆశీస్సులతో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

# పాడేరు ఘాట్ రోడ్డు లో లోయలో పడ్డ బైక్..ఇద్దరు మృతి

**అల్లూరి జిల్లా , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** పాడేరు మండలం బంట్రోతుపుట్టు ఘాటు రోడ్డులో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం లో ఇద్దరు మృతిచెందగా , మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతులు సుమిత్ర(25) తనుజరాణి (3)గా గుర్తించారు. గాయాలపాలైన చిన్నారి మానస (2) అపస్మారక స్థితిలోకి చేరుకొగా పాడేరు ఆస్పత్రికి స్థానికులు తరలించారు. మరో వ్యక్తి రామకృష్ణకు గాయాలయ్యాయి.

## 2025లో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

- నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె. శ్రీనివాసరాజు
- ప్రభుత్వ విప్ ఉ ఎమ్మెల్సీ డా. వేపాడ చిరంజీవిరావుకు వినతి



**విశాఖపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** 2025లో బదిలీ అయ్యి, వివిధ కారణాలతో ఇంకా రిలీవ్ కాని ఉపాధ్యాయులను ఈనెల ఏప్రిల్ 22న రిలీవ్ చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరి శ్రీనివాసరాజు కోరారు. విశాఖపట్నంలోని శాసనమండలి ప్రభుత్వ విప్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవి రావును ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు విన్నవించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు: ఐ.ఈ.ఆర్.టి ఉపాధ్యాయులను కోర్టు ఆదేశాల మేరకు రెగ్యులర్ చేయాలని, మినిమమ్ టైమ్ స్కేల్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్స్ మరియు కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉపాధ్యాయుల మాదిరిగానే అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుండి 10వ తరగతి వరకు ఉన్న తరగతులను విడగొట్టి, 1 నుండి 5వ తరగతి వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి పరిధిలోనే ఉంచాలని, కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాలు పెంచాలని కోరారు. బకాయిలు చెల్లించినందుకు అభినందనలు: గత ప్రభుత్వంలో పేరుకుపోయిన బకాయిలను తీరుస్తూ, మరోసారి రూ. 7,059 కోట్లు విడుదల చేసి, పదవీ విరమణ చేసిన వారికి లక్షలాది రూపాయలు జమ చేసినందుకు.. అలాగే ప్రస్తుతం పనిచేస్తున్న వారికి పిఎఫ్, జీవిత భీమా, ఇతర బకాయిలు దాదాపు పూర్తి చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న డి.ఏ ఐ.ఆర్ వెంటనే ప్రకటించేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ చిరంజీవి రావును కోరారు. ఈ మేరకు సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చిరంజీవిరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరి శ్రీనివాసరాజుతో పాటు, విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షులు సురెడ్డి జగన్ మోహన్, విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. గోవింద నాయుడు, అనకాపల్లి డివిజనల్ ఇన్‌ఛార్జ్ నర్సింపల్లి మోహన్, నాయకులు డి. సూర్యనారాయణ పాల్గొన్నారు.

## భౌతిక మానసిక వ్యాయామాలే నాడీ వ్యవస్థకు దివ్య ఔషధాలు!

- ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తించి మందులను వాడితే నివారణ సాధ్యం!



**విశాఖపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** నాడీ వ్యవస్థ సక్రమంగా పనిచెయ్యడానికి, మానసిక ఒత్తిడిని జయించడానికి నడకను నిత్య వ్యాయామంగా మలచు కోవాలని, యోగ ధ్యానాదులను అభ్యసించడం ద్వారా వణుకుడు వ్యాధికి దివ్యౌషధంగా అవి ఉపకరిస్తాయని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ బి.దేముడుబాబు పేర్కొన్నారు. సీషోర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు కె. విజయానంద్ , కార్యదర్శి ఎం ఎస్ నాయుడు , కోశాధికారి పూసపాటి లక్ష్మిరాజు ఉడాపార్క్ లో "పార్కిన్సన్స్ దే" (వణుకుడు)వ్యాధి" పై ఆదివారం నిర్వహించిన 'అవగాహనా సదస్సు'లో డా.దేముడుబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అరవై ఏళ్ల వయసు పైబడిన కొందరిలో మాత్రమే నాడీ కణాలు మెదడను దెబ్బతీయడం జరుగుతుందని, 'న్యూరో(ట్రాన్స్మిటర్' డోపామైన్ పనిచేయక పోవడం మూలంగానే పార్కిన్సన్స్ వ్యాధి (వణుకుడు వ్యాధి) వస్తుందని, చేతులు,కాళ్ళు,దవడలలో వణుకు రావడం, కండరాల బిగదీయడం. పట్టేయడం, చేపట్టిన పనివేగంలో తగ్గుదల, స్నానం,తినడం వంటి అతి సాధారణ కార్యకలాపాలను కూడా ఆలస్యం చేస్తారని , నిరాశ నిస్పృహలు, భయము, వ్యక్తియొక్క మాటల్ని, చేతి(వ్రాతను కూడా దెబ్బతీయడం ఈ వ్యాధి యొక్క ప్రాథమిక లక్షణాలన్నారు. ప్రారంభ దశలోనే వ్యాధి గుర్తించి, వైద్యులు సూచించిన మందులను వాడుతూ, నిత్య వ్యాయామం, కేర్ గివర్ సపోర్ట్ తో వ్యాధి బాధితులు మామూలు జీవితాన్ని పొందవచ్చన్నారు. శ్రోతలు అడిగిన అనేక సందేహాలని ఆయన నివృత్తి చేశారు. ఈ సభలో 'వాకర్స్ హెల్త్ క్లబ్' అధ్యక్షులు సి హెచ్. శ్రీనివాసరాజు మాట్లాడుతూ సకాలంలో స్పందించి, ఆపదలో ఉన్నవారిని ఆదుకొనే స్వభావాన్ని ప్రతి ఒక్కరూ మానవత్వంగా మలచు కోవాలని,వాకర్స్ క్లబ్స్ నిర్వహిస్తున్న అనేక ఉచిత వైద్య ,ఆరోగ్య అవగాహనా శిబిరాలలో ఎంతోమంది లబ్ది పొందుతున్నారని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులో పాల్గొన్న ముఖ్య అతిధులను, సీషోర్ వాకర్స్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. పెదసోములు, ప్రతినిధి కె ఎస్ సాయిప్రసాద్, సిప్లా కో-ఆర్డినేటర్ బి.కొండబాబు, గిరిజ మామిడి తదితరులను సీషోర్ క్లబ్ అధ్యక్షులు విజయానంద్ జ్ఞాపికలను అందజేస్తూ, శాలువాలతో ఘణంగా సత్కరించారు.

## పేదలకు తక్కువ ధరలో ఆధునిక వైద్య పరీక్షలు

- ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో నూతన పరికరాల డయగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం.
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్






**విశాఖపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** పేద మరియు మధ్య తరగతి ప్రజలకు సరసమైన ధరల్లో ఆధునిక వైద్య పరీక్షలు అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. గెయిల్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకం కింద విశాఖపట్నంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో అత్యాధునిక వైద్య పరికరాలను దయాగ్నొస్టిక్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద గల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ఏర్పాటు చేసిన దయగ్నోస్టిక్ సెంటర్ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రక్తదాన సేవల ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడుతున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఇప్పుడు ఆధునిక వైద్య పరీక్షలను కూడా తక్కువ ఖర్చుతో అందించడం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. తలసేమియా బాధితులకు నిరంతరం రక్తం అందిస్తూ సేవలందిస్తున్న ఈ సంస్థ మరింత విస్తృత సేవల దిశగా ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు ఈ దయాగ్నోస్టిక్ సేవలు ఎంతో ఉపయోగకరమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో సమగ్ర మార్పులు తీసుకువస్తూ ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వంతో పాటు వలు సంస్థలు ప్రజల ఆరోగ్య రక్షణలో భాగస్వామ్యంగా నిలుస్తున్నాయని, ఆరోగ్య శాఖను మరింత పటిష్టం చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. రక్తదానం పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారుఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వై.డి. రామారావు మాట్లాడుతూ, కొత్తగా ఏర్పాటు చేసిన పరికరాల ద్వారా థైరాయిడ్, సంతానోత్పత్తి, క్యాన్సర్ స్క్రీనింగ్, హెపటైటిస్ వంటి అంటువ్యాధుల నిర్ధారణ పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు, ఈసీజీ, ట్రెడ్‌మిల్, లివర్ ఫంక్షన్, మూత్రపిండాల పరీక్షలు, రక్తంలో చక్కెర స్థాయి పరీక్షలు, అల్ట్రాసౌండ్ వంటి పలు సేవలను ఖచ్చితత్వంతో, తక్కువ ధరలకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ విశాఖ జిల్లా చైర్మన్ సి. బాల సతీష్, వైస్ చైర్మన్ మురళీ కృష్ణ పట్నాయక్, ట్రెజరర్ గుడివాడ ప్రసాదరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శ్రీ నరవ ప్రకాశరావు పాల్గొన్నారు.

## చిట్ఫండ్ మరియు ఫైనాన్స్ వ్యాపారస్తులపై పోలీసులు ఉక్కు పాదం మోపాలి

**పరవాడ , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :**అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ,లంకెలపాలెం సెంటర్లో మితిమీరిన ఫైనాన్సర్ల ఆగడాలు లంకెలపాలెం సెంటర్లో ప్రతిరోజు సుమారుగా 100 నుండి 150 మంది ఫైనాన్సర్లు చిట్ఫండ్ కంపెనీ ఓనర్స్ విచ్చలవిడిగా వ్యాపారం చేస్తూ గవర్నమెంట్ కి టాక్స్ లు కట్టకుండా కష్టాల్లో ఉన్నవాళ్లకి ఆసరా చేసుకుని అధిక వడ్డీకి 3 నుండి తొమ్మిది రూపాయల వరకు వసూలు చేసి వ్యాపారస్తుల నుండి జలగల్లా అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. తీసుకున్న తర్వాత చేసేది లేక వాళ్ళ చేత మాటలు పడుతూ ఇవేకాక ఒక రోజు లేట్ అయితే దుర్భాషలతో గొడవలు చేసేవారు కూడా ఉన్నారు. కన్నూరు, పెదమసిడివాడ, మంత్రి పాలెం, గాజువాక, సాలాపు వానిపాలెం, తాడి, గాజువాక, ఈ పరిసర ప్రాంతంలో నుండి ప్రతిరోజు చిన్న పెద్ద వ్యాపారస్తులతో ఫైనాన్స్ వ్యాపారం సాగిస్తున్నారు, మంత్లీ చిట్స్ కూడా రన్ చేస్తున్నారు గత కొన్ని సంవత్సరాలుగా లక్షల్లో విచ్చలవిడిగా వ్యాపారం చేస్తున్నారు.

## ప్రతి సోమవారం మండల స్థాయి లో మీ కోసం గ్రీవెన్స్ డే తప్పని సరిగా నిర్వహించాలి

- అధికారులందరూ నవోత్సాహంతో పని చేయాలి
- మండల స్థాయి మరియు జిల్లా స్థాయి అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం



**పాడేరు, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** ప్రజల సమస్యల పరిష్కారమే పరమావధిగా ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో మీ కోసం 'గ్రీవెన్స్ డే' (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) ను తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టి.నిశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ తిరుమని శ్రీపూజ, ఐటిడిఏ పిఓ ఆదిత్య వర్మ, ఆర్డీవో ఎం వి ఎస్ లోకేశ్వరరావు, డిఆర్వో నీలకంఠరావు, మరియు అన్ని జిల్లా శాఖల అధికారులతో ఆమె మాట్లాడుతూ కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలి రేపటి నుండి ప్రతీ సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి తహసీల్దార్, ఎంపీడీవోలతో పాటు మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు అగ్రికల్చర్, ఇంజనీరింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రైబల్ వెల్ఫేర్ విద్య, ఇంజనీరింగ్, ఐసిడిఎస్, హౌసింగ్, డీఆర్డీఏ తదితరులు తప్పనిసరిగా హాజరుకావాలని, గ్రీవెన్స్ సక్రమంగా జరుగుతుందో లేదో జాయింట్ కలెక్టర్ పర్యవేక్షించాలని, డిఆర్వో ఇందుకు సహకరించాలని సూచించారు. ప్రతి మండలంలో ఏ అధికారులు హాజరయ్యారు, ఎవరు గైర్హాజరయ్యారు అనే వివరాలతో కూడిన అటెండెన్స్ లిస్టును వెంటనే కలెక్టరేట్‌కు పంపాలని ఆదేశించారు. ప్రజల నుండి వచ్చే వినతులను ఆ శాఖల లాగిన్ లలో రిజిస్ట్రేషన్ చేయించి, ఎప్పటికప్పుడు పరిష్కరించేలా గ్రీవెన్స్ నిర్వహణ అత్యంత సమర్థవంతంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులందరినీ నవోత్సాహంతో పని చేయాలని ఆదేశించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి అధికారులు, మండలాల తహసీల్దార్లు మరియు ఎంపీడీవోలు పాల్గొన్నారు. అధికారులు తమ పరిధిలోని కింది స్థాయి సిబ్బందికి కూడా ఈ ఆదేశాలను వెంటనే చేరవేయాలని కలెక్టర్ సూచించారు. సోమవారం మండల స్థాయిలో నిర్వహిస్తున్న మీ కోసం PGRS కోసం అన్ని గ్రామాల్లో ప్రజలకు చేరువయ్యేలా ఎంపిడిఓ, తహసీల్దార్ లు టామ్ టామ్ ద్వారా గ్రామ స్థాయిలో విస్తృతంగా ప్రచారం కల్పించి సమర్థవంతంగా నిర్వహించేటట్లు ఆదేశించారు. పై ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని హెచ్చరించారు.

# గంజాయి లభించకుండా చర్యలు : విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్





**విజయనగరం , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** విజయనగరం జిల్లా బొబ్బిలి పోలీసు స్టేషన్ ను, బొబ్బిలి రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, సందర్శించారు, పోలీసు స్టేషన్, సర్కిల్ ఆఫీసు పరిసరాలను పరిశీలించారు. జిల్లా ఎస్పీ కి బొబ్బిలి సిఐ కే.నారాయణరావు, బొబ్బిలి రూరల్ సిఐ ఎస్.శ్రీనివాస్ పూల మొక్కలను అందజేసి, స్వాగతం పలికారు. బొబ్బిలి పోలీసు స్టేషను పరిధిలో రహదారి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, యువత గంజాయి ప్రభావానికి గురికాకుండా అవగాహన కల్పించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన క్రికెట్ బెట్టింగు, జూదం ఆడవద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, మాట్లాడుతూ బొబ్బిలి పోలీసు స్టేషను పరిధిలో రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్స్ ను సందర్శించి, ప్రమాద కారణాలను అన్వేషించి, రహదారి ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రతీ ద్విచక్ర వాహన దారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విధంగా చూడాలని, ప్రజలకు రహదారి భద్రత ప్రమాణాలు పట్ల అవగాహన కల్పించాలని, ఇందుకు మహిళా సంరక్షణ పోలీసుల సేవలను వినియోగించుకోవాలన్నారు. గంజాయి ప్రభావంకు యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. ఇటీవల జిల్లా పోలీసుశాఖ చేపట్టిన చర్యలు ఫలితంగా గంజాయి అక్రమ రవాణ, వినియోగం, అమ్మకాలు చాలా వరకు తగ్గాయన్నారు. జిల్లాలో గంజాయి వినియోగం పూర్తిగా నియంత్రించి, జీరో స్థాయికి తీసుకొని వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. యువతను చైతన్యపరిచి గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు వలన కలిగే అనర్ధాలను వివరించి, వారిలో మార్పు తీసుకొని వచ్చేందుకు గతంలో ప్రారంభించిన 'సంకల్పం' కార్యక్రమాన్ని తిరిగి చేపట్టి, పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. అంతేకాకుండా, ప్రతీ పోలీసు స్టేషను పరిధిలోని ముఖ్య కూడళ్ళు, రైల్వే స్టేషన్లు, బస్టాండులు, కళాశాలలు వద్ద సంకల్పం బాక్సులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు గంజాయి అక్రమ రవాణ, వినియోగం, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని ఎటువంటి సంకోచం లేకుండా ఒక కాగితంపై వ్రాసి, ఈ బాక్సుల్లో వేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచి, గంజాయి నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. అంతేకాకుండా, గంజాయి గురించిన సమాచారం ఎవరికైనా తెలిసినట్లయితే టోల్ ఫ్రీ నంబరు 1972 లేదా డయల్ 100/112కు అందించాలని కోరారు. చాలామంది యువకులు చట్ట వ్యతిరేకంగా క్రికెట్ బెట్టింగు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. క్రికెట్ బెట్టింగు, జూదంలను తీవ్రమైన నేరంగా పరిగణించి, విస్తృతంగా తనిఖీలు చేపట్టడంతోపాటు, యువతకు కౌన్సిలింగు నిర్వహించి, వారి మొబైల్ ఫోనులోని బెట్టింగు యాప్ లను తొలగిస్తున్నామన్నారు. బెట్టింగుల వలన ఎక్కువ మొత్తంలో డబ్బులను నష్టపోవడంతోపాటు కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. కావున, బెట్టింగు, జూదం వంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని యువతకు జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. హైవేపై లారీలను నిలిపి వేయకుండా హైవే పెట్రోలింగు విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని, అధికారులు హైవే పెట్రోలింగు వాహనాలను పర్యవేక్షించాలని ఆదేశించారు. హైవేపై లారీలను, ఇతర భారీ వాహనాలను నిలిపి వేయడం వలన ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. కావున, రహదారిపై వాహనాలు నిలపకుండా చూడాలని, ఆగివున్న వాహనాలు ఇతర వాహనదారులకు కనిపించే విధంగా వాహనాల వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లను అతికించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం, పోలీసు స్టేషనులో పని చేసే పోలీసు సిబ్బందితో జిల్లా ఎస్పీ మమేకమై, వారి సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ చర్యలు చేపట్టారు. బొబ్బిలి పోలీసు గెస్ట్ హౌస్ ఆధునీకరణ పనులను జిల్లా ఎస్పీ పరిశీలించి, అధికారులకు ఆధునీకరణ పనులకు సంబంధించి సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో బొబ్బిలి సిఐ కే.నారాయణరావు, బొబ్బిలి రూరల్ సిఐ ఎస్. శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ'

**ఒకటి తరువాయి** పరిష్కరించేందుకు ప్రతి సోమవారం 'డయల్ యువర్ ఏపీఈపీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ కార్యక్రమం విశాఖపట్నంలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించబడుతుంది. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు 8688400499 ఫోన్ నంబర్ ద్వారా తమ సమస్యలను తెలియజేయవచ్చు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సరఫరా అంతరాయాలు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, కొత్త కనెక్షన్ల జారీలో జాప్యం, సరఫరా పునరుద్ధరణలో ఆలస్యం, ట్రాన్స్‌ఫార్మర్ మార్పిడి, రూఫ్‌టాప్ సోలార్ వంటి వివిధ సమస్యలపై ఫిర్యాదులను నేరుగా సీఎండీ దృష్టికి తీసుకురావచ్చు. ఈ అవకాశాన్ని సంస్థ పరిధిలోని 11 జిల్లాల విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

## ప్రముఖ గాయని ఆశా భోంస్లే మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** ఆమె మరణం భారత సంగీత రంగానికి తీరని లోటు, ఎప్పటికీ భర్తీ కాని ఖాళీ పద్మ విభూషణ్ పురస్కార గ్రహీతగా భారత సంగీత చరిత్రలో ఆమెకు చిరస్థాయి స్థానం తన మధుర స్వరంతో తరతరాల శ్రోతలను మంత్రముగ్ధులను చేసిన గాన కోకిల వేలాది పాటల ద్వారా భారతీయ సంగీతాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన గొప్ప కళాకారిణి తన అపార ప్రతిభతో ఎన్నో అరుదైన రికార్డులు సృష్టించిన లెజెండరీ సింగర్ భారతీయ సంగీతానికి కొత్త దారులు చూపిన వినూత్న గాన శైలికి ప్రతీక సంగీత సేవలో ఆమె చేసిన కృషి ఎప్పటికీ చిరస్మరణీయం ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను .వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు

# వర్షపు నీటిని ఒడిసి పడదాం! భూగర్భ జలాలను పెంపొందిద్దాం!





**గోపాలపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** జేడీ ఫౌండేషన్ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా సీబీఐ మాజీ జేడీ వి వి లక్ష్మీనారాయణ సూచనతో గోపాలపట్నం సింహాచలం రోడ్డు పవన్ రెసిడెన్సీని ఎదురుగా ఉన్న కొండవద్ద స్వచ్ భారత్ నిర్వహించి అనంతరం వర్షపు నీటిని ఒడిసి పడదాం భూగర్భ జలాలను పెంపొందిద్దాం అనేనినాదంతో ఆంధ్రా ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జలమే జీవం కార్యక్రమం నేపధ్యంలో ఆయా ప్రాంతాన్నీ మెగా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్ గా తయారు చేశారు,ఈప్రాంతంలో కొంతకాలం క్రితం కొండ దిగువన నిర్మాణం దేవస్థానం రక్షణ గోడ నిర్మించారు.రక్షణ గోడకు కొండ కూ మధ్యలో ఉన్న ప్రాంతశీలో ఉన్న ప్లాస్టిక్,గాజు వ్యర్థాలను ఏరివేసి వర్షపు నీరు భూమిలోనికి చేరేలా రాళ్ళుతో నింపే కార్యక్రమం నిర్వహించారు. తద్వారా వాన నీటిని తక్కువ ఖర్చుతో వడిసి పట్టే విధానం అమలు చేయడం జరిగింది,పెద్దఎత్తున ఫౌండేషన్ సేకరించిన ప్లాస్టిక్ ,గాజు, వ్యర్థాలను జీవీఎంసీ వారు తరలించడం జరిగింది . ఈకార్యక్రమంలో స్థానికులు, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు

# నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

- విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్



**విశాఖపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరుగుతాయని, రెవెన్యూ అధికారులతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. అలాగే 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలు, మీకోసం ఏపీ గవర్నమెంట్ ఇన్ వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ఇప్పటివరకు ఆయా శాఖలకు అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమీక్ష ఉంటుందని, సంబంధిత నివేదికలతో అధికారులు నిర్ణీత సమయానికి రావాలని ప్రకటన ద్వారా ఆదేశించారు

# ముత్యాలమ్మ జాతర ఏర్పాట్లపై అధికారుల సమావేశం నేడు

**చింతపల్లి, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** చింతపల్లి గ్రామదేవత శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జాతర సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవడంపై పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, జాతర నిర్వాహక కమిటీ సభ్యులతో కీలక సమావేశం నిర్వహించనున్నారు. జాతర రోజుల్లో భారీగా భక్తులు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్యం, తాగునీటి సదుపాయం, రాకపోకల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేకంగా చర్చించనున్నారు. ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండేలా అధికారులకు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం. ఈ సమావేశం సోమవారం 13వతేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరగనుంది. సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీతామహాలక్ష్మి తెలిపారు.

# సోమవారం జివిఎంసి లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- పునర్వ్యవస్థీకరణ చెందిన 10 జోన్ లలో పి జి ఆర్ ఎస్ కార్యక్రమం

- జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోను, పునర్వ్యవస్థీకరణ చెందిన భీమిలి, మధురవాడ , ఈస్ట్, వెస్ట్, సౌత్ ,నార్త్, పెందుర్తి ,గాజువాక, అగనంపూడి అనకాపల్లి జోన్ల కార్యాలయాల్లోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హారికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై 2026 ఏప్రిల్ 13 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియవరుచు కోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియ చేశారు. జీవీఎంసీ వెస్ట్ జోన్ కార్యాలయం 52 వ వార్డు లో గల ఎన్. ఎ .డి కొత్త రోడ్డు , గౌరీ నగర్ లో పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం నందు ఏర్పాటు చేయడమైనదనీ. నార్త్ జోన్ కార్యాలయం 51 వ వార్డులో మాధవధార ఉడా లేఅవుట్, ఆర్ . టి. ఎ ఆఫీస్ రోడ్డు, పంప్ హౌస్ వెనుక ఉత్తర నియోజకవర్గం కార్యాలయం లో ఏర్పాటు చేయడమైనదనీ. అగనంపూడి జోన్ కార్యాలయం 85వ వార్డులో పెదమడక, శివాలయం రోడ్డు , వినాయక టెంపుల్ సమీపములో గల రాజీవ్ గాంధీ కళ్యాణ మండపం లో ఏర్పాటు చేయడమైనదనీ. కావున ప్రజలు ఈ పై జోన్ల ప్రదేశాలను గమనించవలసిందిగా కోరుచూ ,మిగిలిన అన్ని జోన్ల కార్యాలయాలు యధా స్థానంలో ఉన్నవని తెలిపారు.

# రుషికొండ రహదారిపై ద్విచక్రవాహనం దగ్ధం



**విశాఖపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** చిన్న రూషి కొండ ప్రాంతంలోని రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనం దగ్ధమైంది. సంఘటన సంబంధించిన వివరా లు ఇలా ఉన్నాయి. శివకుమార్ అనే వ్యక్తి వాహనంపై గడ్డి తీసుకుని వెళు ్తండగా సైలెన్సర్ నుంచి మంటలు చెలరేగాయి. అవి వ్యాపించడం తో క్షణాల్లోనే వాహనం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. స్థానికులు వెంటనే స్పందించి మంటలను అదుపు లోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. అయితే వాహనం పూర్తిగా దగ్ధమై నష్టపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నేడు కలెక్టరేట్ లో పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

- అర్జీల సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100కు కాల్ చేసి తెలుసుకోవాలి : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



**అనకాపల్లి, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్), రెవెన్యూ క్లినిక్ ల కార్యక్రమాలను నేడు ఏప్రిల్ 13 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంతో పాటు జిల్లాలో అన్ని మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ప్రకటన లో పేర్కొన్నారు. పి. జి. ఆర్. ఎస్, రెవెన్యూ క్లినిక్ లలో సమర్పించిన అర్జీల సమాచారం కోసం 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు నేరుగా కాల్ చేసి తెలుసుకోవాలని అర్జీదారు లకు కలెక్టర్ సూచించారు. పి జి ఆర్ ఎస్, రెవిన్యూ క్లినిక్ ల కు హాజరు కాని అర్జీదారులు(మీ కోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్) వెబ్సైట్ ద్వారా అర్జీలు నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు.

# పి ఎల్ పురం లో ఘనంగా తలుపులమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ





**పాయకరావుపేట, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** ఉత్తరాంధ్ర ప్రజల కోర్కెలు తీర్చే తలుపులమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం పి ఎల్ పురంలో ఘనంగా నిర్వహించారు. చింతకాయల రాంబాబు, శ్రీరంగం పండు ఆధ్వర్యంలో తలుపులమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం పి ఎల్ పురం శ్రీ అనంత పద్మానాభస్వామి ఆలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు చింతకాయలరాంబాబు, శ్రీరంగం పండు ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రతిష్ట కార్యక్రమంలో కోటిపల్లి చిట్టిబాబు, శ్రీదేవి, తుమ్మల బుచ్చియ్య, నూకరత్నం సమక్షంలో శ్రీ తలుపులమ్మ తల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం పూజాప్రక్రియ విధి విధానాలతో భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈసందర్భంగా జరిగిన ఈకార్యక్రమంలో చైర్మన్ పిల్లి తాసుబాబు, మేడిశెట్టి దివానం,పడాల వెంకటరమణ పాల్గొన్నారు.

## మర్రివలసలో తాగు నీరు సౌకర్యం కల్పించాలి : సిపిఎం



**అరకులోయ , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** అరకులోయ మండలం చొంపి గ్రామపంచాయతీ మర్రివలస గ్రామాల్లో రక్షిత మంచినీరు సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు ఆదివారం ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.. సిపిఎం పార్టీ చొంపి శాఖ కార్యదర్శి గెమ్మెలి జగన్నాథం మాట్లాడుతూ మర్రివలస గ్రామంలో సుమారు 15 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.. గ్రామంలో గతంలో బోరింగ్ వేయించి వీధి కొళాయిలు వేయించడం జరిగింది.. నీరు గ్రామ ప్రజల అవసరమైన నీరు సరిపోవడం లేదనీ,15 నిమిషాలు మాత్రమే నీరు వస్తున్నదనీ. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనీ. వేసవి వస్తుండడం తాగునీరు ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అధికారులు వెంటనే స్పందించించాలని, మర్రివలస గ్రామం ప్రజలకు సరిపడేటట్లు మంచినీరు సౌకర్యం కల్పించాలని సిపిఎం పార్టీ ప్రభుత్వం డిమాండ్ చేస్తుందన్నారు. . సకాలంలో నీరు అందించలేనిపక్షంలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు..ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు బి.కోగేశ్వరరావు, పార్టీ సభ్యులు దాసు, మర్రివలస గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు..

## చట్టాలు ఉల్లంఘన మాత్రమే కాదు, అమలు లోపం కూడా నేరమే : మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు

**చింతపల్లి , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :**ఆదివాసీ గిరిజనుల కోసం ప్రభుత్వం రూపొందించిన చట్టాలు ఉల్లంఘన నేరమైతే, వాటిని అమలు చేయకపోవడం కూడా నేరంగానే పరిగణించాల్సిన అవసరం ఉందని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు పేర్కొన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం అమల్లో ఉన్న చట్టాలు భూమిపై సక్రమంగా అమలు కాకపోవడం ఆందోళన కరమని ఆయన అన్నారు. గిరిజన ప్రాంతాల్లో భూ హక్కులు, అటవీ హక్కులు, పీఈఎస్ఏ (పేసా) వంటి చట్టాలు ఉన్నప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాటి ప్రయోజనాలు ప్రజలకు పూర్తిగా అందడం లేదని విమర్శించారు.



ముఖ్యంగా గిరిజన భూముల ఆక్రమణ, అటవీ వనరుల దోపిడీ వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో చట్టాల అమలు మరింత కఠినంగా ఉండాలని సూచించారు. జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు చట్టాల అమలులో లోపాలు కొనసాగుతుండటం వల్ల గిరిజనుల్లో అసహనం పేరుకుపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చట్టాల ఉల్లంఘనపై మాత్రమే కాకుండా, వాటి అమలులో విఫలమవుతున్న అధికారులపైనా బాధ్యత నిశ్చయించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కుల పరిరక్షణలో ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా అమలు కావాలని, స్థానిక ప్రజల భాగస్వామ్యం పెంచాలని సూచించారు.చట్టాలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, గ్రామ స్థాయిలో అమలై గిరిజనుల జీవితాల్లో మార్పు తీసుకురావాలని పసుపులేటి బాలరాజు స్పష్టం చేశారు.

## విజయనగరంలో ఘనంగా డాక్టర్ హానిమన్ జన్మదిన వేడుకలు

**విజయనగరం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** హోమియోపతి వైద్య విధానం ద్వారా ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని అందించవచ్చు. హానిమన్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు సేవా దృక్పథంతో ముందుకు సాగాలి."అని వైద్యులు, విద్యార్థుల ను మరియు ఇంటర్న్‌ల ను ఉద్దేశించి హోమియో వైద్యులు విజ్ఞప్తి చేశారు. హోమియోపతి వ్యవస్థాప కులు డాక్టర్ శామ్యూల్ హానిమన్ జన్మదినాన్ని పురస్కరిం చుకుని, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజిషియన్స్ విజయనగరం యూనిట్ ఆధ్వర్యం లో స్థానిక మెసోనిక్ టెంపుల్ వద్ద ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 65 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందు లను పంపిణీ చేశారు. రోగులకు మెరుగైన సేవలందించే క్రమంలో ఉచితంగా షుగర్ టెస్ట్, రక్తపోటు పరీక్షలతో పాటు అవసరమైన వారికి వైద్య పరీక్షలు కూడా నిర్వహించారు.

## మరణించిన హెడ్ కానిస్టేబులు జగదీశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటాం



- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్.,
- హార్ట్ స్ట్రోక్ తో ఆకస్మికంగా మరణించిన హెడ్ కానిస్టేబులు జగదీశ్వరరావు భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్
- ఫ్యూనరల్ ఖర్చులు, విడో ఫండ్ మరియు ఫ్లాగ్ ఫండ్ నుండి రూ.1లక్ష కుటుంబ సభ్యులకు అందించిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్
- జగదీశ్వరరావు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా కల్పించిన జిల్లా ఎస్పీ


**విజయనగరం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** విజయనగరం జిల్లా పోలీసుశాఖలో డి.సి.ఆర్.బి. విభాగంలో హెడ్ కానిస్టేబులుగా పని చేస్తూ, గుండె పోటుతో ఆకస్మికంగా మరణించిన ఎ.జగదీశ్వరరావు భౌతికకాయాన్ని జిల్లా ఎస్పీ శ్రీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ గారు ఏప్రిల్ 12న సందర్శించి, పూలమాల వేసి, నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. వివరాల్లోకి వెళ్ళితే.. జిల్లా పోలీసు పోలీసుశాఖలో డి.సి.ఆర్.బి. విభాగంలో హెడ్ కానిస్టేబులుగా ఎ.జగదీశ్వర రావు పని చేస్తూ, ఏప్రిల్ 11న రాత్రి హార్ట్ స్ట్రోక్ తో మరణించారు. రాత్రి సమయంలో ఎ.జగదీశ్వరరావుకు తీవ్రమైన గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు, ఇతరుల సహకారంతో చికిత్స నిమిత్తం దగ్గరలో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించారు. హెడ్ కానిస్టేబులు జగదీశ్వరరావు మరణించిన విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఏప్రిల్ 12న ఉదయం జగదీశ్వరరావు నివాసం ఉంటున్న అయ్యప్పనగర్ లోని ఇంటికి చేరుకొని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జగదీశ్వరరావు భౌతిక కాయానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. జగదీశ్వరరావు కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్పీ మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుండి రావల్సిన అన్ని బెనిఫిట్స్, పెన్షన్ సకాలంలో మంజూరయ్యే విధంగాను, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం వచ్చే విధంగా చర్యలు చేపడతామన్నారు. జగదీశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని, ఏ సహాయం కావాల్సి ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చునన్న భరోసాను కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ అందించారు. అంతిమ సంస్కారాల నిర్వహణకు అవసరమైన సహాయాన్ని జగదీశ్వరరావు కుటుంబ సభ్యులకు అందించాలని డిఎస్పీ ఆర్.గోవిందరావును, 2వ పట్టణ పిఎస్ ఇన్చార్జ్ సిఐ బి.లక్ష్మణరావును ఆదేశించారు. ప్రభుత్వ బెనిఫిట్స్ పొందేందుకు ప్రతిపాదనలు పంపేందుకు అవసరమైన సహాయాన్ని జగదీశ్వరరావు కుటుంబ సభ్యులకు అందించాలని అసోసియేషను ప్రెసిడెంట్ కే.శ్రీనివాసరావును జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. ప్రజలతో, తోటి సిబ్బందితో మర్యాదగా వ్యవహరించే వ్యక్తిగా, తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా పూర్తి చేసేవానిగా, అందరితో సులువుగా కలిసిపోయే మనస్తత్వం కలిగిన వ్యక్తిగా, నెమ్మదస్తునిగా మరణించిన ఎ.జగదీశ్వరరావుకు పోలీసుశాఖలో మంచి గుర్తింపు ఉందన్నారు. జిల్లా ఎస్పీ వెంట విజయనగరం మహిళా పిఎస్ డిఎస్పీ ఆర్.గోవిందరావు, డిసిఆర్బీ సిఐ కే.కుమార స్వామి, 1వ పట్టణ సిఐ ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ట్రాఫిక్ సిఐ సిహెచ్.సూరి నాయుడు, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, పోలీసు అసోసియేషను అధ్యక్షులు కే.శ్రీనివాసరావు మరియు ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మా మార్కెట్‌కు దారి చూపండి!

**విజయనగరం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** పార్వతీపురం మున్సిపల్ చేపలు, మాంసం మార్కెట్లో సమస్యలు ఈత కొడుతున్నాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, ఓబిసి జిల్లా చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, నియోజకవర్గ చైర్మన్ బంకరు ప్రకాష్ రావు, ఏవో గంట మోహన్ రావు తదితరులు పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం ఆవరణ లో ఉన్న నెహ్రూ కూరగాయలు, చేపలు, మాంసపు మార్కెట్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా మార్కెట్లలో వ్యాపారులు, మార్కెట్ యూనియన్ ప్రతినిధులతో వారు మాట్లాడి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా అక్కడ వ్యాపారులు పలు సమస్యలను కాంగ్రెస్ పార్టీ నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. మార్కెట్లో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలు పరిస్థితి దారుణంగా ఉందన్నారు. కరెంట్ లేకపోవడంతో మార్కెట్లో ఎక్కువసేపు ఉండలేని పరిస్థితి ఉందన్నారు.

# బీభత్సం సృష్టిస్తున్న రోడ్డు ప్రమాదాలు





- ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి
- క్షేమంగా వెనక్కి వస్తాడన్న నమ్మకం లేని పరిస్థితి
- శాశ్వత అంగవైకల్యంతో జీవచ్ఛవాలుగా మారుతున్నావైనం
- ప్రమాదానికి కారణం ఎవరు.

**అల్లూరి జిలా, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** తెల్లారింది మొదలు ఎక్కడో ఓ చోట ప్రమాదం, తీవ్ర గాయాలు అంటూ ఆలకిస్తుంటాం, రోడ్డు ప్రమాదం విషయం తెలియకుండా లేని రోజు లేదంటే రోడ్డు ప్రమాదాల బీభత్సం ఏవిధంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది. అసలు ప్రమాదాలు జరగడానికి కారణం ఎవరు, చట్టాలు అమలు చేస్తూ నిబంధనలు పాటించమని చెబుతున్న పోలీసుల,.. పోలీసు నిబంధనలను పెడచెవిన పెట్టి యువతకు బళ్ళు ఇస్తున్న తల్లితండ్రులదా... లేక బండి చేతిలో ఉంది ఎవరు ఏమి చేస్తారు అనే ధీమాతో సెల్ఫోన్ డ్రైవింగ్ చేస్తున్న యువత దా.. అనే ప్రశ్నలకు ప్రస్తుత సమాజంలో సమాధానాలు దొరకడం లేదనేది జగమెరిగిన సత్యం. ఒకపక్క పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తూ నిబంధనల పాటించమని ఆదేశిస్తూ కేసులు నమోదు చేస్తున్న రోజురోజుకీ ప్రమాదాలు పెరుగుతున్నాయి కానీ తగ్గడం లేదంటే ఏ విధంగా వాహన చోదకులు పరుగులు తీస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది. ఎస్ ఎస్ జె ఫౌండేషన్ ఫౌండర్ హర్ష రోడ్డు ప్రమాదాలపై తన ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.ఇంటికి ఆధారమైన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబ స్థితిగతులు ఎంతటి దయనీయంగా మారతాయో వర్ణనాతీతం. క్షతగాత్రుల పరిస్థితి మరీ ఘోరం. వైద్య ఖర్చులతో అప్పులపాలవ్వడమేకాకుండా, శారీరక వేదన వారిని కుంగదీస్తుంది.దేశవ్యాప్తంగా ఏడాదికి సగటున నాలుగున్నర లక్షల వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే...అందులో ఏకంగా 1.70 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళనకరం అలాగే మన దేశంలో వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది కానీ, దానికి అనుగుణంగా రోడ్డు భద్రతపై అవగాహన పెరగకపోవడం దురదృష్టకరం. రాంగ్ సైడ్ డ్రైవింగ్, సెల్ఫోన్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి ఉల్లంఘనలు ఏటా రెండు మూడు రెట్లు పెరుగుతున్నాయి. మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ లేదా సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటి నిర్లక్ష్యాలే పెద్దయెత్తున ప్రాణ నష్టానికి దారితీస్తున్నాయి. నేడు సమాజంలో రికార్డింగ్ కల్చర్ అనే కొత్త జాడ్యం ప్రబలింది.ఎక్కడైనా ప్రమాదం జరిగితే బాధితులకు సాయం చేయాల్సిందిపోయి,సెల్ఫోన్లలో వీడియోలు తీస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడానికే చాలామంది మొగ్గుచూపుతున్నారు. బాధితులను గోల్డెన్ అవర్ లో ఆసుపత్రికి చేరిస్తే బతికే అవకాశం ఉంటుందని తెలిసినా, వీడియోల మోజులో మానవత్వాన్ని మర్చిపోతున్నారు. ఈ ధోరణి మారాలి,తోటి వారికి సాయం చేయడమే నాగరిక లక్షణం. ఆ సమయంలో తక్షణమే 108కి సమాచారం అందించడం, అవసరమైతే బాధితులకు సీపీఆర్ చేయడం ద్వారా ఎన్నో నిండు ప్రాణాలను నిలబెట్టవచ్చు. రోడ్డు ప్రమాదాల నివారణలో డిఫెన్సివ్ డ్రైవింగ్ అత్యంత కీలకం అంటే, ఎదుటి డ్రైవర్ తప్పు చేసినా లేదా రహదారి పరిస్థితులు సరిగ్గా లేకపోయినా... మన అప్రమత్తతతో ప్రమాదాన్ని నివారించడం. రహదారిపై వెళ్లేటప్పుడు కేవలం మన వేగాన్ని మాత్రమే కాదు, పరిసరాలను కూడా గమనిస్తూ ఉండాలి. ట్రాఫిక్ నిబంధనలను భయంతో కాకుండా, బాధ్యతగా పాటించినప్పుడే రహదారులు సురక్షితమవుతాయి. మరి ముఖ్యమైన అంశం ఏంటంటే రహదారుల వెంట ఉండే రెస్టారెంట్లు, మెడికల్ షాపులు, పెట్రోల్ బంకుల సిబ్బందికి, సెక్యూరిటీ గార్డులకు 'ఫస్ట్ రెస్పాండర్' అంటూ ముందుకు వస్తే ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు వీలు పడుతుంది. క్షతగాత్రులకు సీపీ ఆర్ చేయడం, సురక్షితంగా ఆసుపత్రికి తరలించడం వంటి అంశాల్లో వారికి అవగాహన ఉంటే ప్రమాదాలు జరిగిన బయట పడే అవకాశాలు ఉంటాయి. ప్రమాదాల్లో సాయం చేసిన వారిని జిల్లాలో ఉన్న ఉన్నతాధికారులు గుడ్ సమరిట న్లుగా గుర్తించి సన్మానించడం వల్ల సమాజంలో ఒక సానుకూల దృక్పథం ఏర్పడింది. సాంకేతికతను, వ్యవస్థాగత సంస్కరణలను జోడించడం ద్వారా రహదారి భద్రతను మరింత పటిష్ఠం చేయవచ్చు. ప్రజా ఉద్యమంగా మారాలి! ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియాను సైతం రహదారి భద్రతకు వేదికగా మార్చు కోవచ్చు.ఇదే స్ఫూర్తితో ఇటీవల కాలంలో అల్లూరి జిల్లా పాలన యంత్రాంగం, పోలీ సులు చేపట్టిన 'నో హెల్మెట్–నో ఎంట్రీ' కార్యక్రమం ఆదర్శంగా నిలుస్తోంది. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లోనూ దీన్నో ఉద్యమంలా తీసుకెళ్తున్నారు. ఇలాంటి ప్రయోగాలు రాష్ట్రవ్యాప్తం గా విస్తరించినప్పుడే రహదారులు మృత్యుపాశాలుగా మారకుండా నివారించగలం. ఇది కేవలం నిబంధనల అమలుకు పరిమితమై న అంశం కాదు, ప్రతి పౌరుడి ప్రాణానికి రక్షణ కల్పించడం అందరి ప్రాథమిక బాధ్యతగా ఈ కార్యక్రమం గుర్తుచేస్తోంది.ఇదో చైతన్యవంతమైన ప్రజా ఉద్యమంగా మారాలి.ఎంత కట్టుదిట్టమైన చట్టాలు ఉన్నా, పోలీస్ యంత్రా ంగం ఎంతగా శ్రమించినా, ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం లేనిదే రోడ్డు భద్రత పరిపూర్ణం కాదు. ప్రతి వాహనదారుడు చలానాల భయంతో కాకుండా, తన ప్రాణం తన కుటుంబానికి ఎంతో విలువైనదన్న స్పృహతో మెలగాలి. గమ్యాన్ని వేగంగా చేరుకోవడం కాదు, క్షేమంగా చేరుకోవడమే ప్రయాణానికి అసలైన సార్థకత. దీన్ని అందరూ అర్థంచేసుకున్న ప్పుడే రోడ్డు ప్రమాదాల్లో మరణాలు తగ్గుతాయి.ఈ సందేశం ప్రతి ప్రయాణానికి ఒక దిశానిర్దేశం కావాలని ఎస్ హెచ్ జె ఫౌండేషన్ ఫౌండర్ హర్ష జనపరెడ్డి తెలియజేశారు.

# సింహాచల క్షేత్రంలో 'కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం' దర్శన వేళల్లో మార్పులు

**సింహాచలం , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దివ్య క్షేత్రమైన సింహాచలంలో అత్యంత పవిత్రమైన "కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సేవ", కారణముగా ఈ నెల 2026 ఏప్రిల్ 14 (మంగళవారం) స్వామివారి దర్శన వేళల్లో కొన్ని మార్పులు చేసినట్లు ఆలయ నిర్వహకుల తెలిపారు.ఆధ్యాత్మిక సంప్రదాయం ప్రకారం, ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని 'కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం' అంటారు. ఈ పవిత్ర కార్య క్రమంలో భాగంగా గర్భాలయం మొదలుకుని ఆస్థాన మండపము వరకు అన్ని ప్రాకారాలను ప్రత్యేకము గా సంప్రదాయబద్ధంగా శుద్ధి చేస్తారు.ఆలయ పరిసరాలను దైవిక శక్తితో పునీతం చేసే ఈ పవిత్ర కార్యక్రమ నిర్వహణ కారణంగా మంగళవారం నాటి దర్శన సమయాల్లో కొన్ని మార్పులు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం 2:00 గంటల నుండి రాత్రి 9:00 గంటల వరకు స్వామివారి సర్వదర్శనాలు నిలుపుదల చేయబడును. తిరిగి మరుచుట రోజు యధావిధిగా స్వామివారి దర్శనం లభించును.కావున దూరప్రాంతాల నుండి విచ్చేసే భక్తులు, స్థానిక భక్తులు ఈ సమయ మార్పును గమనించి, దేవస్థాన సిబ్బందికి సహకరించవలసిందిగా కార్యనిర్వాణ అధికారి కోరారు.



WANTED REPORTERS

మనం

రెండు తెలుగు రాష్ట్రాల్లో తనదంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకుని ప్రజల గొంతుకై కొనసాగుతున్న మనం తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు విలేకరులు కావలెను. స్థానిక సమస్యలపై అవగాహన కలిగి తెలుగు భాషపై పట్టున్నవారు సంప్రదించగలరు.

కావలసిన జిల్లాలు

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, మన్యం (పార్వతీపురం)

పైన పేర్కొన్న జిల్లాలకు వాటి పరిధిలోని మండలాలకు రిక్రూట్మెంట్ జరుగుతుంది.

ఆసక్తి కలవారు సంప్రదించగలరు

విలేకరులు కావలెను (కాంటాక్ట్ ఇమీడియెట్లీ)

ఎం.వి.ఎస్.జి. తిలక్, ఉత్తరాంధ్ర రీజనల్ బ్యూరో చీఫ్

e-mail id : journalist.tilak03@gmail.com

సంప్రదించాల్సిన నెంబరు :94945 24365

# ఎస్సీ ఎస్టీ సూర్యఘర్ యోజన ఉత్సవ్ ప్రారంభించిన గణబాబు





**విశాఖపట్నం, ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకముగా ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ , జోన్-2 విశాఖపట్నం ఆధ్వర్యంలో 'ప్రధానమంత్రి ఎస్సీ ఎస్టీ సూర్యఘర్ యోజన ఉత్సవ్' కార్యక్రమాన్ని ఏప్రిల్ 5, 2026 నుండి ఏప్రిల్ 14, 2026 వరకు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) నియోజవర్గం పరిధిలోని మల్కాపురం లో ఆదివారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలకు సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించడం, సబ్సిడీ పథకాలను వివరించడం మరియు ఉచిత విద్యుత్ దిశగా వారిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని, "పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" ద్వారా లభించే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడానికి ఈ పది రోజుల ఉత్సవాన్ని ఏర్పాటు ఏర్పాటు చేశామన్నారు. నియోజవర్గం ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగించుకొని వారి ఇళ్లపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు స్థానిక నేతలు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ చూపెట్టండి ఇంజనీర్ శ్యామ్ బాబు, నాయుడు (ఈ ఈ), ఏడి, ఏఈ,మజ్జి సోమేష్, జోజి, సర్వసిద్ధి లక్ష్మి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న విఎంఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



**విశాఖపట్నం , ఏప్రిల్ 12 ( మనం న్యూస్ ) :** తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త సందాని చోట కుమార్తె వివాహ వేడుకకు విఎమ్ఆర్డిఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ మహమ్మద్ రహమతుల్లా( చిన్ని బాయ్) మరియు పెద్ద సంఖ్యలో టిడిపి జనసేన నాయకులు, ముస్లిం మైనార్టీ పెద్దలు ఈ వివాహ వేడుకకు హాజరయ్యారు స్థానిక ఓడ చిల్డ్రన్స్ థియేటర్లో ఎంతో ఘనంగా ఈ వివాహం జరిగింది. మైనార్టీ నాయకులు చిన్ని బాయ్ వధూవరులను ప్రత్యేకంగా ఆశీర్వదించారు.